

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60


జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 24.0



16 నెలలుగా మంత్రివర్గ విస్తరణ జరగకుండా పదవులన్నీ ఖాళీగా ఉన్నాయి. మంత్రి పదవులు ఇచ్చే సమయంలో మాజీ మంత్రి జానారెడ్డి అధిష్ఠానానికి ఉత్తరం రాయడంతో విస్తరణ జాప్యమవుతోంది.

● కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



రాజకీయ దుమారం

- జానారెడ్డి టార్గెట్‌గా రాజగోపాల్‌రెడ్డి కామెంట్లు
- జానా లేఖతోనే మంత్రిపదవి చేజారిందనే భావనలో ఎమ్మెల్యే
- అధిష్ఠానం హామీ ఇచ్చినా నేతలు అడ్డుపడుతున్నారని ఆరోపణ
- మూడోమంత్రి పదవిపై జిల్లాలో రగులుతున్న రాజకీయం

మాజీ మంత్రి, సీనియర్‌నేత జానారెడ్డిని నేరుగా టార్గెట్ చేస్తూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించాయి. తనకు మంత్రిపదవి రాక పోవడానికి జానారెడ్డి రాసిన లేఖ కారణమని భావిస్తోన్న రాజగోపాల్, మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో ఒక్కసారిగా రాజకీయ దుమారం చెలరేగింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక దాదాపు 16నెలల తర్వాత మొదటిసారిగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో పార్టీలో అసంతృప్తి బహిర్గతమైంది. ఈ పరిస్థితి టీకప్పులో తుఫానులా సద్దుమణుగుతుందా..? లేక అసమ్మతి ప్రజ్వరిల్లి వర్గపోరుకు దారి తీస్తుందా..? అని రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చసాగుతోంది. తనకు మంత్రిగా అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిన మాట వాస్తవమని, మంత్రి పదవి ఖరారయ్యే సమయంలో జానారెడ్డి లేఖతో మళ్లీ మొదటికొచ్చిందని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తాను ఇన్నిరోజులూ ఆగానని, ఇక తాను కూడా మంత్రిపదవి కోసం అడుగుతానని, వెనకబడిన ప్రాంత అభివృద్ధికోసం మంత్రిపదవి కావాలని డిమాండ్ చేశారు.

ఖమ్మంలో ముగ్గురికి ఇచ్చినప్పుడు..

ఖమ్మంలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు గెలిస్తే, ముగ్గురికి మంత్రి పదవులిచ్చినప్పుడు, నల్లగొండలో 11 మందిని గెలిపిస్తే ఎందుకివ్వరని రాజగోపాల్‌రెడ్డి నిలదీయడం రాజకీయవర్గాల్లో తీవ్రచర్చకు దారి తీసింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంలో రాష్ట్రంలో ఒక్కో సీటుకు ఒక్కో మంత్రి ఇన్‌చార్జిగా ఉన్నారని, ఎక్కడాలేని విధంగా భువనగిరిలోనే ఒక ఎమ్మెల్యేనైన తాను ఇన్‌చార్జిగా బాధ్యతలిచ్చారంటే, తన సమర్థతపైనా, అభ్యర్థిని గెలిపిస్తాననే నమ్మకం ఉండబట్టే ఇచ్చారని, ఆ ఎన్నికలో అన్ని నియోజకవర్గాలు తిరిగి అభ్యర్థిని గెలిపించడమే తన సమర్థతకు, పనితీరుకు నిదర్శనమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొంటున్నారు. మంత్రులు ఇన్‌చార్జిలుగా ఉన్న మహబూబ్‌నగర్, సికింద్రాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల స్థానాల్లో ఎందుకు ఓడిపోయారని, ఈ మంత్రులంతా ఎటు పోయారని ప్రశ్నించడం ద్వారా లోక్‌సభ ఎన్నికలపై చర్చను రాజేసినట్లయింది. ఒకే కుటుంబానికి రెండు మంత్రి పదవులు ఎలా ఇస్తారనే అంశాన్ని ప్రస్తావిస్తూ రాజగోపాల్‌రెడ్డి ఇస్తే తప్పేంటని, సమర్థతను పరిశీలించాలే తప్ప ఇలాంటి సమీకరణాలు కాదని, తనకు మంత్రి పదవి వస్తే పార్టీకి, ప్రజలకు మేలు చేస్తానని పేర్కొన్నారు.

అసమ్మతికి బీజం పడ్డట్లేనా...!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 16 నెలల తర్వాత మొదటిసారిగా రాజగోపాల్‌రెడ్డి రూపంలో అసమ్మతి స్వరం వెలువడింది. తనకు అధిష్ఠానం ఇస్తానన్న మంత్రిపదవికి దుర్మార్గంగా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారంటూ రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలు ఢిల్లీలో జరిగిన తెరవెనక మంత్రాంగాన్ని తెలియజేస్తోంది. తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని, అధిష్ఠానం సుముఖంగా ఉన్నా జిల్లా నేతలే అడ్డుపడుతున్నారని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించడం పార్టీలో అంతర్గత విబేధాలున్నాయనే అంశాన్ని స్పష్టం చేస్తోంది. నేరుగా జానారెడ్డిని టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ అధిష్ఠానానికి తన సందేశాన్ని నేరుగా ఇచ్చినట్లవుతుందనే వ్యూహంలో భాగంగానే రాజగోపాల్‌రెడ్డి జానాపై వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. కొందరు నాయకులు తనకు మంత్రిపదవి రాకుండా దుర్మార్గంగా అడ్డుకుంటున్నారని పేర్కొన్న రాజగోపాల్‌రెడ్డి ఎవరి పేర్లు ప్రస్తావించలేదు...

- మిగతా 5వ పేజీలో...



పాల బిల్లుల కోసం.. నిరీక్షణ

- నెలలతరబడి వేచి చూస్తున్న పాడి రైతులు
- సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పశుపోషణకు ఇబ్బందులు
- మదర్ డెయిరీ అప్పులతో రైతులకు కష్టతరంగా మారిన వైనం
- ప్రభుత్వ గ్రాంటా? స్థిరాస్తుల విక్రయమా..?

మదర్‌డెయిరీలో నెలకొన్న అప్పులతో పాడి రైతులకు బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది. నెలల తరబడి పాల బిల్లులకోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రైతులకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పశు పోషణకు ఇబ్బందులు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఏర్పాటైన నల్లగొండ-రంగారెడ్డిజిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం(మదర్‌డెయిరీ) అప్పుల ఊబిలో చిక్కుకుంది. మదర్‌డెయిరీకి ప్రస్తుతం రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పులున్నాయి. నెలకు రూ.45లక్షల మేరకు వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రైతులకు సకాలంలో సంస్థ బిల్లులు చెల్లించలేక పోతుంది. మదర్ డెయిరీ భవిష్యత్‌తోపాటు సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని రైతుల్లో చర్చ మొదలైంది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో నార్మాల్ పరిధిలో మొత్తం 290 పాల సంఘాలున్నాయి. పాలసంఘాల ద్వారా నిత్యం దాదాపు 60వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. పాడి రైతులకు నెలావారీగా బిల్లులు చెల్లించాలని పాల సంఘాల చైర్మన్లు పాలకవర్గానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం పాలకవర్గం ఆధ్వర్యంలో మదర్‌డెయిరీని లాభాల బాట పట్టించి, రైతులకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తుందన్న అంశం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మదర్‌డెయిరీకి ప్రత్యేకంగా గ్రాంట్‌ను మంజూరు చేయించేందుకు పాలకవర్గం కసరత్తు చేస్తుంది. మరోవైపు సంస్థ పరిధిలోని భూములను వేలం వేసి రైతులకు చెల్లించాల్సిన బిల్లులతోపాటు...పలు బ్యాంకుల్లో ఉన్న అప్పులు తీర్చాలని కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. ఆస్తుల విక్రయం ఆలస్యమవుతున్నందున, ప్రభుత్వం నుంచి తక్షణం సహాయం కోసం జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యలు విన్నవించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో..

- మిగతా 5వ పేజీలో...

సన్న బియ్యం ధరలు దిగొచ్చే

- మార్కెట్‌లో క్వింటాకు రూ.400 మేర తగ్గిన సన్నబియ్యం ధరలు
- మధ్య తరగతి వర్గాల్లో ఆనందం
- రేషన్‌దుకాణాలకు క్యూ కడుతున్న ప్రజలు



సన్నబియ్యం ధర తగ్గుతోంది. ఇన్నాళ్లు కేవలం ధనిక కుటుంబాలకే పరిమితమైన సన్నబియ్యం భోజనం కాంగ్రెస్ ప్రభుత్వ పథకంతో ఇప్పుడు పేద వారికి కూడా అందుతోంది. దీంతో మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.600 వరకు తగ్గింది. సన్నబియ్యం ధరలు తగ్గుతుండడంతో ఇటు పేద, మధ్య తరగతి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి కలెక్టరేట్)

4

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

- ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో గుండాలలో వృద్ధురాలు
- లారీ ఢీకొని చౌటుప్పల్ మండలంలో మరొకరు..
- ఉమ్మడి జిల్లాలో మరో నలుగురి దుర్మరణం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. గుండాల మండలంలో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం.. వృద్ధురాలి మృతికి కారణమైంది. చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద లారీ ఢీకొని ఒకరు మృతి చెందారు. దేవరకొండ, వేములపల్లి, కేతేపల్లి మండలాల్లో జరిగిన ప్రమాదాల్లో మరో ముగ్గురు దుర్మరణం చెందారు.

4

నవ వధువు బలవన్మరణం

- పెళ్లయిన 25 రోజులకే విషాదం
- చౌటుప్పల్ పట్టణంలో ఘటన

బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది

- 25 ఏళ్ల పండుగకు వెల్లువలా జనం తరలి రావాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఇతర నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోనుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ 25ఏళ్ల పండుగకు జనం వెల్లువలా తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. శ్రీశైలం సొరంగమార్గాన్ని శాశ్వతంగా మూసివేసేందుకు ప్రభు త్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదన్నారు. సొరంగంలో ప్రమా దం జరిగితే సహాయక చర్యలు చేపట్టి వారిని వెలికితీసే తెలివి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. రైతులకు బాధ కలగగానే కేసీఆర్ ఉంటే బాగుండునని కేసీఆర్ తలుచుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులకు, వారు పెట్టే కేసులకు భయపడబోమన్నారు. వారు చేసిన పనులకు వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. మంత్రులంతా దందాల్లో మునిగి తేలుతున్నారన్నారు. పార్టీ పెట్టినప్పు డు చంద్రబాబు నాయుడు టీఆర్ఎస్ ఉండదని, మధ్యలోనే బంద్ అవుతుందని శాపనార్థాలు పెట్టారని గుర్తుచేశారు. మొదటి వార్షికోత్సవ సభను నల్లగొండలో పెట్టి విజయవంతం చేశామని ఎన్నో మైళ్ల రాళ్లను అధిగమించి అనేక మంది రాక్షసులను తరిమికొట్టామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోతలకు పరిమితమయ్యారని, ఆయనకు చేత కాదని, మిల్లర్లు రైతులపై దాడికి దిగుతున్నారన్నారు. రెండు రోజుల క్రితం సూర్యాపేటలో ఓ రైతు మద్దతు ధర రాక ధాన్యానికి నిప్పు పెట్టుకున్నాడన్నారు. రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లకు కల్తీ నిత్యావసర సరుకులు సరఫరా చేస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ 25ఏళ్ల పండుగకు వరంగల్‌కు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను, ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చకిలం అనిల్ కుమార్, జి.వెంకటేశ్వర్లు, మాలే శరణ్యారెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, కరీంపాషా, తండు సైదులు, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్ రెడ్డి, యాట జయప్రద, రవీందర్‌రావు, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న రాజశేఖర్‌రెడ్డి, సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదును పెంచి, పాఠశాలలను కాపాడుకుందాం అని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆయన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు క్రమక్రమంగా తగ్గుతుందని, ప్రతీ యూటీఎఫ్ కార్యకర్త కర్తవ్యంగా తీసుకొని, బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేరే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించాలని, ప్రభుత్వ విద్యవల్ల మాత్రమే అంతరాలు లేని సమాజం ఏర్పడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ అధ్యయనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా, హక్కులు-బాధ్యతలు రెండు నేత్రాలుగా ముందుకు పోతూ ప్రభుత్వ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎడ్ల సైదులు, గేర నరసింహ, నల్లపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు, పాలబిందెల రాజశేఖర్, రవీందర్, సైదులు, రాంబాబు, కృష్ణప్రసాద్, రమణ, నవీన్ రెడ్డి, భూరానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతిపై నేడు రైతు వేదికల ద్వారా

సీఎం సందేశం

నల్లగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారంనుంచి భూభారతిని రాష్ట్రంలోని మూడు మండలాల్లో ప్రయోగాత్మకం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతు వేదికల ద్వారా సీఎం రేవంత్ రెడ్డి తన సందేశాన్ని రైతులకు తెలియజేస్తారని జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి మంత్రులు, శాస్త్రవేత్తలు రైతులకు భూభారతితో పాటు రైతునేస్తం వంటి అంశాల గురించి వివరిస్తారన్నారు. సాయంత్రం 5గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి భూభారతిని ప్రారంభించి రైతు వేదికలో ఉండే రైతులనుద్దేశించి మాట్లాడుతారని చెప్పారు. రైతువేదికలకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యమకారుల ఫోరం ప్లీనరీని

విజయవంతం చేయాలి

ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు ఈ నెల 21న నిర్వహించే తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీని విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకోగా ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ముస్తాఫా, కార్యదర్శి దాసరి వెంకన్న ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద, శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో కూడిన ఇల్లు, రూ.25 వేలపింఛన్ ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాల్లో ఆయా గ్రామాల్లో ఉన్న ఉద్యమకారులను గుర్తించి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యమకారులు నలపరాజు శ్రీనివాస్, బొడ్డుపల్లి రామకృష్ణ, కట్టా శ్రీనివాస్, రమేష్‌చారి, భార్గవ్, వంటెపాక యాదగిరి, ముజీబ్, యాదయ్య, మనిమద్దె రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం మండలం ఆకారం ఐకేపీ కేంద్రంలో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

వడగళ్ల వాన బీభత్సం

- నేలకొరిగిన చెట్లు.. తోటలు ధ్వంసం
- కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యం

నకిరేకల్,ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాలవర్షంతో రైతుల ధాన్యం తడిసి ముద్దయింది. మండలంలోని ఓగోడు, వల్లభాపురం, నడిగూడెం ఐకేపీ కేంద్రాల్లో రైతులు విక్రయానికి తెచ్చిన సుమారు 15వేల బస్తాల ధాన్యం అకాల వర్షంతో తడిసింది. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం లో భారీ ఈదురు గాలులతో వడగళ్ల వాన కురిసింది. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. పలు తోటలు ధ్వంసమయ్యాయి. ఈ వర్షంతో జనజీవనానికి తీవ్ర ఆటంకం కలిగింది. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు వర్షానికి కొట్టుకుపోయాయి. రైతు గౌర శేఖర్ ధాన్యం రాశులు వర్షం నీటిలో కొట్టుకుపోయాయి. ఆకారం, భైరవుని బండ, గురజాల, చిత్తలూరు ఐకేపీ కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు కూలి పోయాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది.

పోలీసుల అదుపులో అనుమానితులు..?

● గద్దపాటి సురేష్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

నల్లగొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలో ఈనెల 11వ తేదీ రాత్రి జరిగిన కలర్ ల్యాబ్ యజమాని గద్దపాటి సురేష్ హత్య కేసుకు సంబంధించి ఆరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివాహేతర సంబంధంతో పాటు ఆర్థిక లావాదేవీలు కూడా ఈ హత్యకు దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిసింది. కలర్ ల్యాబ్ యజమాని గద్దపాటి సురేష్‌కు, పార్టనర్‌కు మధ్య కూడా గొడవలు ఉన్నట్లు తెలిసింది. వివాహేతర సంబంధం విషయమై ఈ ఇద్దరికీ పలుమార్లు ఘర్షణ జరిగినట్లు వినికిడి. శుక్రవారం రాత్రి 10.45గంటలకు నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో ఓ మడిగలో మణికంఠ లేజర్‌కలర్ ల్యాబ్‌కు ఇద్దరు నిందితులు వచ్చి సురేష్‌ దారుణంగా హత్య చేశారు. వేట కొడవళ్లతో నరికిన తర్వాత సురేష్ ప్రాణం ఉందా, పోయిందా తెలుసుకోవడంతో పాటు ఏవైనా కదలికలు ఉన్నాయా అని గమనించి చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాతే నిందితులు వెళ్లిపోయినట్లు చర్చ జరుగుతోంది. సంఘటనా స్థలంనుంచి బైక్‌పై రైల్వేస్టేషన్ వెళ్లి అక్కడ నుంచి రైలులో పరారైనట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. రామగిరిలోని పలుసీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు రైల్వేస్టేషన్ వైపు ఉన్న సీసీ కెమెరాలను కూడా పోలీసులు పరిశీలించారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో ఓ మహిళా కూడా ఉన్నట్లు తెలిసింది. హత్య చేసినవారిలో మిర్యాలగూడకు చెందిన వారితో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తెలుసుకున్నట్లు సమాచారం. ఈ హత్య కేసు నేడో, రేపో ఒక కొలిక్కి రావడంతో పాటు చిక్కుముడి కూడా వీడనుంది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాలకు చెందిన పదిమంది బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు ఆదివారం అప్పగించారు. మూడు నెలలుగా వివిధ పనులపై కొండమల్లేపల్లికి వచ్చిన తాము సెల్‌ఫోన్లు పొగొట్టుకున్నామని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను రికవరీ చేసి 10 సెల్‌ఫోన్లు అప్పగించినట్లు ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

రైతులు, రైస్‌మిల్లు యాజమాన్యం ఫిర్యాదులు

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించేందుకు వచ్చిన తమపై ఓ రైస్‌మిల్లు యాజమాన్యం దాడికి పాల్పడిందని రైతులు, మిల్లులోకి చొరబడి అలజడి సృష్టించారని మిల్లుయాజమాన్యం పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామశివారులోని సూర్యతేజ రైస్‌మిల్లు వద్ద శనివారం రాత్రి జరిగింది. ట్రాక్టర్లలో ధాన్యం తెచ్చి విక్రయించేందుకు గంటల తరబడి మిల్లు పాయింట్‌వద్ద రైతులు నిరీక్షిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉన్నా పట్టించుకొని మిల్లర్లు రాత్రి పొద్దుపోయాక ఖరీదు చేయడంలేదని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సహనం కోల్పోయిన మిల్లు యాజమాన్యం తమ సిబ్బందిని రైతులపైకి ఉసిగొల్పి భౌతికదాడికి పాల్పడింది. ఈ సంఘటనలో ఓ రైతు స్పృహతప్పి పడిపోయాడు. తమపై దాడికి పాల్పడిన రైస్‌మిల్లు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు నాగరాజు, వెంకన్న, సైదులు రూరల్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు తమ మిల్లులోకి చొరబడి అలజడి సృష్టించారని సదరు వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రైస్‌మిల్లు యజమాని పయిడిమర్రి రంగనాథ్ ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు రైస్‌మిల్లు సీసీకెమెరాలను పరిశీలిస్తున్నారు. దాడికి కారణమైన వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేస్తామని రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

నవ వధువు బలవన్మరణం

● పెళ్లయిన 25 రోజులకే చౌటుప్పల్‌లో విషాదం

చౌటుపల్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వివాహమైన 25రోజులకే ఓ నవ వధువు బలవన్మరణానికి పాల్పడింది. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఈ విషాదం నెలకొంది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం అనాజిపురానికి చెందిన జెల్లా గాయత్రి (19)కి చౌటుప్పల్ పద్మశాలి కాలనీకి చెందిన సంతోష్‌కుమార్‌తో మార్చి 16వ తేదీన వివాహమైంది. భర్త సంతోష్‌కుమార్ ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సంతోష్‌కుమార్ ఉదయం సమయంలో విధులకు వెళ్లగా, అత్తమామలు బంధువుల వివాహానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. తలుపులు ధ్వంసంచేసి లోపలికి వెళ్లి చూడగా గాయత్రి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించారు. అప్పటికే ఆమె మృతిచెందటంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్త సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గాయత్రి చిన్న వయసులోనే తల్లిదండ్రులు మృతిచెందటంతో మేనమామ వద్దే పెరిగింది. గాయత్రి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత



మోత్కూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో అస్వస్థకు గురైన నెమలిని ఆ రైతు ఆదివారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మోత్కూరులో దేవరపల్లి అశోక్‌రెడ్డి ఆదివారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా అక్కడ ఓ నెమలి అస్వస్థతకు గురైన కదలలేని స్థితిలో ఉంది. అది గమనించిన ఆయన పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. నెమలిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ సూరారం కృష్ణయ్య రాగా నెమలిని ఆయనకు అప్పగించారు. నెమలికి చికిత్స చేయించి కోలుకున్నాక అడవిలో వదులుతామని తెలిపారు. నెమళ్లు, ఇతర జంతువులు దప్పిక తీర్చుకోవడానికి వ్యవసాయ పొలాల్లోకి రావడం సహజమని, వాటికి ఎలాంటి హానీ తలపెట్టవద్దని సూచించారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు



ధ్వంసమైన వంట గది

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వంటింట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బాజకుంటలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వర్కాల దుర్గయ్య, దుర్గమ్మ దంపతులు గ్రామ శివారులో ఉన్న తమ కోళ్ల ఫారంలో పనిచేసుకుంటున్నారు. సాయంత్రం కోళ్ల ఫారం నుంచి తిరిగి ఇంటికి వచ్చారు. వంట వండటం కోసం దుర్గమ్మ వంటింట్లోకి వెళ్లి గ్యాస్ సిలిండర్‌ను వెలిగించింది. అయితే గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి పైకి ఎగిరి కింద పడింది. అప్రమత్తమైన దుర్గమ్మ అక్కడి నుంచి బయటికి పరిగెత్తింది. ఈ సంఘటనలో ఇంటిపై కప్పు రేకులు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఇంట్లో ఉన్న దుస్తులు, నిత్యావసర వస్తువులు కాలిపోతుండగా బిందెలతో గ్రామస్థులు నీటిని చల్లి ఆర్పారు. పోలీసులకు సమాచారం అందించగా వచ్చి సిలిండర్‌ను జాగ్రత్తగా బయటకు తెచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన దొడ్డ మల్లయ్య(52) హైదరాబాద్‌లో రైల్వే స్టేషన్‌లో గ్యాంగ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన మల్లయ్య మూడు నెలలుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. శనివారం మద్యానికి డబ్బులు కావాలని భార్య బాలమ్మను వేధించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో శనివారం సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సన్న బియ్యం ధరలు దిగి వచ్చే

● మార్కెట్‌లో క్వింటాకు రూ.400 మేర తగ్గిన సన్నబియ్యం ధరలు ● మధ్య తరగతి వర్గాల్లో ఆనందం ● రేషన్‌దుకాణాలకు క్యూ కడుతున్న ప్రజలు

భువనగిరి (కలెక్టరేట్), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాలకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. నిన్న మొన్నటి వరకు ఉన్న సన్న బియ్యం ధరకు ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాకు రూ.400 నుంచి రూ.600 వరకు తగ్గింది. గత నెలలో ఫైన్ క్వాలిటీ బియ్యం వివిధ బ్రాండ్ల వారీగా క్వింటా ధర రూ.5,800 నుంచి రూ.6,500 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.5వేల లోపే ధర ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నరకం వరి సాగును ప్రోత్సహించి సన్న ధాన్యానికి రూ.500 బోనస్ కూడా ప్రకటించడంతో అటు ప్రభుత్వం, ఇటు మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేశారు. అనుకున్న మేరకు అధికంగా సన్నధాన్యం కొనుగోళ్లు పెరిగాయి. దీంతో సన్నబియ్యం ధరలు తగ్గుతుండడంతో మధ్య తరగతి వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.



యాదాద్రిజిల్లాలో 2.03లక్షల రేషన్‌కార్డులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో 515 రేషన్ షాపులు ఉన్నాయి. సుమారు 2.03లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. ఈ కార్డులకు ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులు 13,711 మంది ఉన్నారు. వారికి ఒక్కో కార్డుపై ప్రభుత్వం 35కిలోల చొప్పున బియ్యం సరఫరా చేస్తోంది. వీటికి ప్రతినెలా 4,304.669 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కేటాయించి పంపిణీకి చర్యలు చేపట్టింది. గతంలో దొడ్డు బియ్యం సరఫరా చేయడం, వాటిని లబ్ధిదారులు తినకపోవడంతో బయటి మార్కెట్‌లో రీసైక్లింగ్ జరిగేవి. ఇప్పుడు సన్న బియ్యాన్ని లబ్ధిదారులే వినియోగిస్తుండడంతో బయటి మార్కెట్‌లో సన్నబియ్యం విక్రయాలు తగ్గి ధరలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి.

అదుపులోకి వచ్చిన సన్నాల ధరలు

రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడంతో మార్కెట్‌లో సన్నబియ్యానికి డిమాండ్ తగ్గి ధరలు అదుపులోకి వచ్చాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు పరిశీలిస్తే బీపీటీ రకం సోనా బియ్యం రూ.5,400, ఆర్‌ఎన్‌ఆర్ రూ.5,400, జైశ్రీరామ్ రూ.5,500, హెచ్‌ఎంటీ రైస్ రూ.5,600 ఉన్నాయి. గత నెలతో పోలిస్తే ప్రస్తుత మార్కెట్లో కొత్త బియ్యం రకాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ నెలలో క్వింటాల్ రూ.400 నుంచి రూ. 600ల ధరలు వరకు తగ్గాయి.

సన్నబియ్యం పంపిణీ బృహత్తర పథకం



మా ఇంట్లో ఐదు యూనిట్లకు ఆరు కిలోల చొప్పున 30 కిలోల బియ్యం వస్తాయి. సుమారు 20రోజులు సరిపోగా మరో పది రోజులకు బియ్యం కొనుగోలు చేస్తే నెల గడుస్తుంది. పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం కొంత ఆర్థికంగా ఊరట కలుగుతోంది. నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేయడం ఆనందంగా ఉంది.

● బింగి గణేష్, నేత కార్మికుడు, రాజాపేట మండలం, రఘునాథపురం గ్రామం.

లబ్ధిదారుల సంతోషం

గతంలో రేషన్‌కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో వాటిని తినకుండా విక్రయించి సన్నబియ్యం కొనుగోలు చేశారు. దీంతో సన్నబియ్యం ధరలు మార్కెట్లో విపరీతంగా పెరిగాయి. చౌక ధరల దుకాణాల్లో ఇచ్చే దొడ్డు బియ్యాన్ని ప్రజలు తినడం లేదని గ్రహించిన ప్రభుత్వం ఈ ఉగాది నుంచి లబ్ధిదారులందరికీ సన్నబియ్యం పంపిణీ ప్రారంభించింది. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం నాణ్యతతో ఉండడంతో మార్కెట్లో కొనుగోలు చేయకుండా లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో ప్రస్తుతం మార్కెట్లో సన్నబియ్యం ధరలు తగ్గుముఖం పడితే మరోవైపు ఇప్పటికే ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం జిల్లాలో 80శాతం మేర పంపిణీ పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం తేవాలి

మిర్యాలగూడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం తేవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్‌సభ 30వ మహాసభల సందర్భంగా సంఘం ఉపాధ్యక్షుడు ప్రభులింగం, సహాయకార్యదర్శి సంధ్య, కోశాధికారి నరేంద్ర ప్రసాద్, నిమ్మల నర్సింహ, సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన జాతా ఆదివారం మిర్యాలగూడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1936లో ఏర్పాటైన ఏఐకెఎస్ రైతాంగ సమస్యలపై పోరాడుతోందన్నారు. దున్నేవాడికే భూమి, రక్షిత కౌలుదారు చట్టం కోసం పోరాడిందన్నారు. భూసంస్కరణలు, భూసేకరణ 2013 చట్టం, ఆహార భద్రత చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం సాధించడంలో కీలక భూమిక పోషించిందన్నారు. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక ఉద్యమంలో అఖిల భారత కిసాన్ సభ కీలక పాత్ర పోషించిందన్నారు. మద్దతు ధర గ్యారెంటీ చట్టం, రుణమాఫీ చట్టం, పంటల బీమా పథకాన్ని రైతులకు అనుగుణంగా సవరించాలన్న తదితర డిమాండ్లపై దేశ వ్యాపిత రైతులను సమీకరించి పోరాడుతోందన్నారు. కౌలు రైతులు, మహిళా రైతులు, పాల రైతులను ఏకం చేసి రైతుల హక్కుల పరిరక్షణకు, ప్రజల ఆహార భద్రత కోసం పోరాడుతున్న అఖిల భారత కిసాన్‌సభ జాతీయ మహాసభలు ఏప్రిల్ 15,16,17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కనకయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఎండీ. సయీద్, లింగా నాయక్, యాదగిరి, రామలింగం, వల్లపట్ల వెంకన్న, ఎర్రబోతు పద్మ, శాంతాబాయి, దుర్గమ్మ, షమీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్యపద్మ

పుచ్చకాయపై అంబేడ్కర్ చిత్రం



అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు పుచ్చకాయపై అంబేడ్కర్ చిత్రంతో పాటు జై భీం అంటూ అక్షరాలను చెక్కి ప్రతిభను చాటాడు. 15నిమిషాల్లో అంబేడ్కర్ చిత్రంతో పాటు అక్షరాలు చెక్కినట్లు సైదులు తెలిపాడు.

● కోదాడ, ఆంధ్రజ్యోతి

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి



రామక్క (ఫైల్)

గుండాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని వస్తాకొండూరు గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి వృద్ధురాలు మృతిచెందింది. పెద్దపడిశాల గ్రామానికి చెందిన గైగుల్ల రామక్క(75) సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం బొల్లంపల్లి గ్రామంలోని తన కూతురు వద్దకు వెళ్లడానికి ఆదివారం ఉదయం పెద్దపడిశాల రోడ్డుపై నిలుచోని ఉండగా అదే గ్రామానికి చెందిన ఉప్పల మల్లేశ్ ట్రాక్టర్ ఇంజన్‌తో దేవరుప్పల వైపు వెళ్తుండగా రామక్కను ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చోబెట్టుకున్నాడు. వస్తాకొండూరు గ్రామ శివారులోకి వెళ్లగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు దిగింది. దీంతో రామక్క కిందపడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం జనగాం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. రామక్క కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ఐ సైదులు తెలిపారు.

ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొని..

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... చందంపేట మండలం చిత్రియాలకు చెందిన రైతు లింగాల అంకులయ్య(55) తన భార్య ఎల్లమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై దేవరకొండకు వచ్చాడు. పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దేవరకొండ పట్టణశివారు డిండి రోడ్డు వద్దకురాగానే ముందు ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అంకులయ్య ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. అంకులయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్లమ్మకు గాయాలయ్యాయి. ఆమె చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంకులయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తమకు ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

కుమార్తె వద్దకు వెళ్లి వస్తుండగా..

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం పంతంగి శివారు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుంట్లగూడెం గ్రామానికి చెందిన వెలగ నర్సింహారెడ్డి(52) బైక్‌పై మల్లారెడ్డిగూడెంలోని తన కూతురు వద్దకు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన నర్సింహారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యూటర్న్ తీసుకుంటున్న లారీని ఢీకొని..

కేతేపల్లి: రోడ్డు జంక్షన్‌లో యూటర్న్ తీసుకుంటున్న లారీని బైక్ వెనుక నుంచి ఢీకొని ఇరువురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం బస్‌స్టేజీ వద్ద జరిగింది. విజయవాడ వైపు నుంచి చీకటిగూడెం వద్ద గల ఓ కంపెనీకి సరుకుతో వస్తున్న లారీ హైవేపై స్థానికంగా గల జంక్షన్‌లో యూటర్న్ తీసుకుంటుంది. ఇదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపుకు వెళుతున్న మోటార్ సైకిల్ యూటర్న్ తీసుకుంటున్న లారీని వెనుక వైపున ఢీకొట్టింది. ఈ సంఘటనలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇరువురు యువకుల తలలు నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు ఎక్కడి వారు.. ఎక్కడ నుంచి ఎక్కడకు వెళుతున్నారనే వివరాలు తెలియలేదు. మోటార్ సైకిల్‌పై ఉన్న టీఆర్ నెంబర్ ఆధారంగా బైక్ విజయవాడకు చెందినగా భావిస్తున్నారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

వేములపల్లి: పిడుగు పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని సల్కునూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన గోపు సుధాకర్‌రెడ్డి(63) ఆదివారం సాయంత్రం తన పొలం వద్దకు బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం ఒక్కసారిగా ఈదరుగాలులతో కూడిన వర్షం పడుతుండడంతో సమీపంలోని చింతచెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో చింతచెట్టు సమీపంలో పిడుగుపడింది. గమనించిన సమీపంలోని రైతులు చూడగా సుధాకర్‌రెడ్డి విగత జీవిగా పడి ఉన్నాడు. వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

కేతేపల్లి: అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల-నకిరేకల్ జంక్షన్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చల్లా రఘురాములు, చల్లా అశోక్, దిలీప్ కారులో ఖమ్మంలోని తమ బంధువుల ఇంట్లో జరిగే వివాహ వేడుకకు ఆదివారం ఉదయం బయల్దేరారు. కారు ఇనుపాముల-నకిరేకల్ జంక్షన్ వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు వెంట గల డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు సీట్లో కూర్చున చల్లా రఘురాములుతో పాటు కారులో ఉన్న అశోక్, దిలీప్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది వీరమణి, నాగాచారి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు తీవ్రంగా గాయపడిన చల్లా రఘురాములును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.



చందంపేట మండలం కంబాలపల్లి అడవిలో సాసర్ పిట్లలో ద్వారా నీటిని నింపుతున్న ట్యాంకర్

వన్య ప్రాణి దాహార్తి తీరి..

● చెక్‌డ్యాంలు, నీటికుంటలు ● సాసర్‌పిట్లు ఏర్పాటు

చందంపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎండాకాలం దృష్ట్యా వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చందంపేట మండలం అమ్రాబాద్ టైగర్ జోన్ కంభాలపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 14,719 హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉండడంతో అడవిలో నీటికుంటలు, చెరువులు, వాగులు ఎండిపోయాయి. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ అధికారులు బోర్లు వేయించి, వాటికి సోలార్ విద్యుత్ ఆధారంగా నడిచే మోటర్లు బిగించారు. దీంతో మోటర్లు ఆటోమెటిక్‌గా పోసి చెక్‌డ్యాంలకు నీరు చేరడం, కుంటలకు నీరు చేరడం, మరికొన్ని చోట్ల సాసర్ పిట్లు ఏర్పాటు చేసి నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. కంభాలపల్లి ఫారెస్ట్ రేంజ్ అటవీ పరిధిలో చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, మనుబోతులు, అడవి పందులు ఉన్నాయి. నీటికోసం ఎలుగుబంట్లు, చిరుతలు గతంలో గ్రామాల్లోకి వచ్చేవి. అటువంటి సంఘటనలు పునరావృతంకాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం..

వేసవికాలం దృష్టిలో ఉంచుకొని వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి అడవిలో సోలార్ బోర్లు, సాసర్ పిట్లు, నీటి కుంటలు ఏర్పాటు చేసి వాటిలో నీరు నిల్వ ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. అడవిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వన్యప్రాణుల సంరక్షిస్తున్నాం.

- భాస్కర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



నీటికోసం నీటికుంట వద్దకు వస్తున్న మనుబోతు





నీటికుంటలో దాహార్తి తీర్చుకుంటున్న కృష్ణజింక

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

● ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. '21వ శతాబ్ధంలో సామాజిక న్యాయ పునఃపరిశీలన' అనే అంశంపై మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ మౌలిక లక్షణమైన స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం సాధనకు మహనీయుల భావజాలాన్ని పోరాట మార్గంలో స్ఫూర్తిని పొందాలన్నారు. సమాజంలో అనేక అపసవ్య ధోరణు ఉన్నాయని, మౌనంగా కాక ప్రశ్నలుగా ముందుకు రావాలని కోరారు. దక్షత, బాధ్యతతో జవాబుదారితనంతో పాలన అందించే ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో విద్యావంతుల పాత్ర కీలకమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నిజమైన హక్కుదారులన్న సత్యాన్ని గ్రామగ్రామాన చేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిగా అధ్యయన పోరాటాలు పరస్పర ప్రేరితాలుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరా బాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు వెంకటేష్, ఎంజీయూ ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ప్రేమ్ సాగర్, అంజిరెడ్డి, శ్రీదేవి, అరుణప్రియ కల్యాణి, ప్రశాంతి, వెంకటంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల జీవితాల్లో వెలుగు

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య



మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

నల్లగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేద ప్రజలకు వరం లాటిందన్నారు. సన్నబియ్యం పథకంతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అంచెల వారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రజల జీవితాలు బాగుపడుతున్నాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలన్నింటిని అమలు చేస్తూ మాట నిలబెట్టుకుందన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలందరికీ సన్నబియ్యం పంపిణీ చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పేదలను పట్టించుకోలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని పేద ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ పార్టీ విషపూరిత ప్రచారం చేస్తోందన్నారు.

పాల బిల్లుల కోసం నిరీక్షణ

(3వపేజీ తరువాయి)

వేచి చూడాల్సిందే. మదర్ డెయిరీ అప్పులను తీర్చేందుకు ప్రభుత్వం నుంచి ప్రస్తుతం పాలకవర్గం ప్రత్యేక గ్రాంట్ మంజూరుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుంది. అయితే కోఆపరేటివ్ చట్టం ప్రకారం మదర్ డెయిరీకి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం సాధ్యమవుతుందా? అన్న అంశం పరిశీలించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించేందుకు స్థిరాస్థుల విక్రయానికే పాలకవర్గం మొగ్గుచూపుతోంది. ఈమేరకు పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో తీర్మానం కూడా చేసింది. డెయిరీ ఆస్తులను బ్యాంకులు జప్తు చేసిన పక్షంలో తక్కువ ధరకు ఆస్తుల విక్రయాలు జరుగుతాయని, మదర్ డెయిరీ పాలకవర్గం ఆధ్వర్యంలో బహిరంగ మార్కెట్‌లో వేలం వేసిన పక్షంలో అధిక ధర వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. 10మందితో నియమించిన కమిటీ ఆధ్వర్యంలో చిట్యాల, మిర్యాలగూడ, తదితర ఆస్తులు అమ్మడం ద్వారా సంస్థకు రూ.55కోట్ల మేరకు వచ్చే అవకాశం ఉందని ఆశాభావంతో ఉన్నారు. వివిధ బ్యాంకుల్లో మదర్‌డెయిరీకి చెందిన అప్పులు తీర్చడంతోపాటు రైతులకు సకాలంలో పాల బిల్లులు చెల్లించవచ్చని పాలకవర్గం భావిస్తుంది.

అప్పులపై సవాళ్లు... ప్రతిసవాళ్లు

మరోవైపు మదర్‌డెయిరీలోని అప్పులపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నాయి. గత పాలకుల వల్లే పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిందని ప్రస్తుత పాలకవర్గం ప్రకటిస్తుండగా... రైతులకు సబ్సిడీపై పాడి గేదెలు, లీటరు పాలకు రూ.4 బోనస్ ఇచ్చి ఆదుకుందని గత పాలకులు ప్రతిస్పందిస్తున్నారు. మదర్ డెయిరీ స్థిరాస్తులు విక్రయిస్తే కానీ బయటపడలేమని ఇటీవల జరిగిన మదర్‌డెయిరీ సర్వసభ్య సమావేశంలో ప్రస్తుత పాలకవర్గం ప్రకటించింది.

2014-15 తర్వాత నష్టాలు

2014-15వరకు లాభాల్లో నడిచిన డెయిరీకి ఆ తర్వాత అన్నీ నష్టాలేనని, చిట్యాల, నకిరేకల్, చండూరు, తదితర ప్రాంతాల్లోని మదర్ డెయిరీకి చెందిన భూములపై గత పాలకులు పెద్ద ఎత్తున అప్పులు తేవడంతో తీవ్రంగా నష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. డెయిరీ నష్టాల్లో కూరుకుపోవడానికి పాలకవర్గమే బాధ్యత వహించాలని, డిస్ట్రిబ్యూటర్‌కు లాభం చేకూర్చే నిర్ణయాలు తీసుకోరాదని... నష్టానికి కారణాలు తెలుసుకుని స్థిరాస్తులు విక్రయించకుండా తగిన చర్యలు చేపట్టాలని పాలకవర్గంలోని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

నెలవారీ బిల్లులు చెల్లించాలి

అయితే పాడి రైతులు మాత్రం సంస్థ అప్పులు ఎలా ఉన్నా... రైతులకు చేయూతనిచ్చేందుకు ఏర్పడిన మదర్‌డెయిరీలో పాలు పోస్తున్న వారికి నెలవారీగా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. ప్రభుత్వం చర్చించి రైతులకు న్యాయం చేయాలని పలు గ్రామాల్లోని పాల సంఘాల చైర్మన్లు కోరుతున్నారు.

'రాజ'కీయ దుమారం

(3వపేజీ తరువాయి)

కానీ జానారెడ్డిలాంటి నేత సైతం ధర్మరాజు వలె వ్యవహరించకుండా ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారంటూ ఆక్షేపించడం ఆయన ద్వారా అధిష్ఠానంపై, పార్టీ ముఖ్యనేతలపై ఒత్తిడి తెచ్చే వ్యూహమేననే చర్చ సాగుతోంది.

లంబాడ ఎమ్మెల్యేలంతా ఖర్గేకు లేఖ

మంత్రిపదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డి ఆదివారం తన గళాన్ని విప్పగా, పదవి ఆశిస్తోన్న ఉమ్మడి జిల్లాకే చెందిన మరో ఎమ్మెల్యే బాలూనాయక్ (దేవరకొండ) సైతం ఇంతకుమునుపే అసెంబ్లీ లాబీల్లో తమ లంబాడ సామాజికవర్గానికి మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని, ఇవ్వకపోతే సహించబోమని పేర్కొన్న విషయం తెలిసిందే. లంబాడ సామాజిక వర్గ ఎమ్మెల్యేలంతా కలిసి మంత్రి పదవి ఇవ్వాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు లేఖ రాశారు. అనంతర పరిణామాల్లోనే రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలని జానారెడ్డి లేఖ రాయడం, ఈ లేఖల ప్రభావానికి తోడు, ఒకే కుటుంబం, కులం, ఒకే జిల్లా తదితర కారణాలను చూపుతూ రాజగోపాల్‌రెడ్డి సహా ఇతర ఎమ్మెల్యేలకు ఆశాభంగం కలిగేలా అధిష్ఠానం మంత్రివర్గ విస్తరణను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలో రాజగోపాల్‌రెడ్డి రూపంలో తొలి అసమ్మతి స్వరం వెల్లడయిందని, పదేళ్లపాటు అధికారంలో లేకపోయినా పార్టీని నమ్ముకొని ఉండడంతోపాటు, గడచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అవకాశాలు దక్కకపోయినా అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేసినవారు, తమకు బలమైన పదవి వస్తుందని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న నాయకులు ఇప్పటికే లోలోపల అసమ్మతితో రగిలిపోతున్నారు. పదవి రాదని తేలితే, పెద్దసంఖ్యలో ఉన్న ఈ ద్వితీయ శ్రేణి నాయకులు సైతం ఎమ్మెల్యేలకు కంట్లో నలుసుల్లా మారడం ఖాయమని వీటన్నింటినీ అధిష్ఠానం ఎంత త్వరగా పరిష్కరిస్తే అంతమంచిదని, ఎంత జాప్యం చేస్తే అంత నష్టం జరుగుతుందని పార్టీ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

ముత్యంరాజుకు పరశురామ పురస్కారం



ముత్యంరాజుకు పరశురామ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

శాలిగౌరారం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన రంగు ముత్యంరాజు గురుస్వామి అత్యంత ప్రతిష్ఠాత్మక పరశురామ పురస్కారం అందుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన శ్రీమలయాళ భగవతి పీఠం, పరశురామ వంశానికి చెందిన ఎస్ఎస్ఎస్ డివోషనల్ గ్రూప్ శివనరసింహన్ తంత్రి ఆధ్వర్యంలో శబరిమలలో జరిగిన కార్యక్రమంలో రంగు ముత్యంరాజు గురుస్వామికి పరశురామ పురస్కారం అందజేశారు. శబరిమలలోని కన్నెముల గణపతి వద్ద ఆంజనేయ ఆడిటోరియంలో ముత్యంరాజు పరశురామ అవార్డును ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు మాజీ అధ్యక్షుడు ఆనంద్ గోపన్, శబరిమల పూర్వమేల్ శాంతి శంకరన్ నంబూద్రి, శివ నరసింహన్ తాంత్రి, సుబ్రహ్మణ్యం నంబూద్రిలు అందజేశారు. ముత్యంరాజు గురుస్వామి చేస్తున్న అయ్యప్పస్వామి దీక్ష వ్యాప్తికి, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పుర స్కారం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యంరాజు మాట్లాడుతూ పరశురాముడు నిర్మించిన శబరిమల శ్రీధర్మశాస్త్ర సన్నిధిలో శ్రీఅయ్యప్పస్వామి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన అరట్టు ఉత్సవాల రోజు పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన ఎస్ఎస్ఎస్ డివోషనల్ గ్రూప్ శివనరసింహన్ తంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు అందుకున్న ముత్యంరాజుకు పలువురు అభినందించారు.

'ఉపాధి' ఎంబీ రికార్డులు సమర్పించాలి: డీఆర్‌డీఏ పీడీ

మర్రిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధి' ఎంబీ రికార్డులు సమర్పించాలని ఎంపీడీవో మున్నయ్యకు డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. 'ఉపాధి హామీ పథకం ఎంబీ రికార్డులు మాయం.. క్షేత్ర సహాయకుడి ఇంట్లో ప్రత్యక్షం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి డీఆర్‌డీఏ పీడీ స్పందించారు. ఈ ఉదంతంపై విచారణ చేసి నివేదిక పంపాలని ఎంపీడీవోకి డీఆర్‌డీఏ పీడీ ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి



ఆసుపత్రిలో అంజిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు వీరస్వామి

శాలిగౌరారం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం నూలగడ్డ కొత్తపల్లి గ్రామానికి చెందిన రాపోలు అంజయ్య అలియాస్ అంజి తన తమ్ముడిపై దాడి జరిగిందని శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, పోలీసులు దాడి చేయడం అమానుషమని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అక్కెనెపల్లి వీరస్వామి అన్నారు. బాధితుడు రాపోలు అంజి వద్దకు మానవ హక్కుల కమిటీ సభ్యులు ఆదివారం వచ్చి నిజ నిర్ధారణ చేపట్టారు. ముందుగా నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంజిని పరామర్శించి దాడికి జరిగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంజిపై అమానుషంగా ప్రవర్తించి నడవలేని పరిస్థితి తీసుకువచ్చిన ఎస్ఐ పై అతడికి సహకరించిన పోలీస్ సిబ్బందిపై విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేసి, సస్పెండ్ చేయాలని, బాధితుడికి నష్ట పరిహారం ఇవ్వాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు ఈ కార్యక్రమంలో అక్కెనపల్లి వీరస్వామి, అద్దంకి దశరథ, గడ్డం వెంకటరమణ, బల్లెం ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515.30
టీఎంసీలు	140.8451
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.24 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	626.60 అడుగులు
టీఎంసీలు	0.99
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	385. 52 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	32.63 క్యూసెక్కులు

రేపు నల్లగొండ జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ పర్యటన

నల్లగొండ టౌన్, దేవరకొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత చట్టం-2023 అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్, సభ్యులు ఈనెల 15న నల్లగొండ జిల్లాలోని కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాల్లో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. రాష్ట్ర ఆహార కమిషనర్ ఒకరోజు పర్యటనలో భాగంగా మంగళ వారం ఉదయం 9.30నుంచి సాయంత్రం 4గంటల వరకు కొండమల్లేపల్లి, దేవర కొండ మండలాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, చౌక ధర దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలను తనిఖీ చేస్తారని తెలిపారు. కమిషన్ పర్యటన దృష్ట్యా సంబంధిత విద్య, వైద్య ఆరోగ్య, పౌరసరఫరాలు, ఫుడ్ సేఫ్టీ, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

యాదగిరికొండపై భక్తుల సందడి

● నిత్యాదాయం రూ.54.91 లక్షలు



ప్రసాద విక్రయాల వద్ద భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో కొండపై సందడి నెలకొంది. శని, ఆదివారం వారాంతపు సెలవు, సోమవారం (అంబేడ్కర్ జయంతి) వరుసగా మూడు సెలవు రోజులు రావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. కొండకింద పార్కింగ్ ప్రదేశం వాహనాలతో నిండిపోయి వైకుంఠ ద్వారం ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేశారు. ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శన) క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి మధ్యాహం వరకు రద్దీగా ఉన్నాయి. వీఐపీ టికెట్ దర్శనానికి గంటన్నర, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. మధ్యాహ్నం గంటసేపు ఆరగింపు సమయంలో క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. ప్రధానాలయం, ఉత్తర ప్రాకార మండపం, కొండకింద వ్రత మండపాలు, లక్ష్మీ పుష్కరిణి, అన్నప్రసాద సత్రం, బస్టాండ్, కొండపైన తిరువీధులు, బస్టాండ్, ప్రసాద విక్రయశాలల్లో కూడా భక్తుల సందడి నెలకొంది. వేసవి తాపానికి తట్టుకోలేక కొండబండపై భక్తులు పరుగులు పెట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.54,91,048ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



సుప్రభాత సేవతోస్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధ ఆలయమైన పాతగుట్టలోనూ స్వామి, అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాల యంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆయన ద్వారబంధనం చేశారు.

సామాజిక విప్లవం సృష్టిస్తాం



బీసీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మునుగోడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దేశంలో మెజార్టీగా ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రాజకీయ రంగాల్లో సమాన వాటా దక్కాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా మునుగోడులో బీసీ సంక్షేమ అనుబంధ సంఘాల అధ్వర్యంలో బీపీ మండల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ చేసిన సిఫార్సులు ఇప్పటి వరకు అమలు కావడం లేదన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మండల సిఫారసులు అమలుచేసి సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక స్థితిగతులపై సమగ్రంగా అధ్యయనం చేసి బీసీల సంపూర్ణ సాధికారికకు బీపీ మండల్ నేతృత్వంలోని కమిషన్ దేశమంతా పర్యటించి 40 సిఫార్సులను కేంద్రానికి చేసిందని, రెండు సిఫార్సులు మినహా మిగతా 38 సిపాసులు ఇప్పటివరకు ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు బీసీలకు విద్యా ఉద్యోగంలో 27 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతుందంటే అది మండల్ చేసిన సిఫార్సులతోనేనని గుర్తుచేశారు. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ యువజన, విద్యార్థి సంక్షేమ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లికార్జున్‌యాదవ్, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, కైలాసంగౌడ్ పాలకూరి కిరణ్, మేకల మల్లయ్యయాదవ్, యాదప్ప, బోయపర్తి లింగయ్య పాల్గొన్నారు.

'ఇంటర్ బోర్డు నిర్ణయం మార్చుకోవాలి'

నల్లగొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ భాష అయిన తెలుగు స్థానంలో సంస్కృతంను ప్రవేశపెట్టడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా తెలుగు ఫోరం ప్రతినిధులు పోతురాజు వెంకులు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, శీలం భద్రయ్య డిమాండ్ చేశారు. నల్లగొండలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాలని చట్టం చేసిన ప్రభుత్వం ప్రస్తుతం ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు కనుమరుగయ్యేలా నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు.

ఆయకట్టు.. మూగజీవులకు ఆయువుపట్టు

వేసవి వచ్చిందంటే చాలు మేత, తాగునీరు దొరకక నాన్ ఆయకట్టు ప్రాంతంలోని మూగజీవులు గోస పడుతుంటాయి. వాటి ఆకలి తీర్చేందుకు కాపరులు తమ ప్రాంతాన్ని, కుటుంబాలను వదలి వందల కిలో మీటర్ల దూరం తీసుకొస్తారు. ఆ మూగజీవాలను సాగర్ ఆయకట్టు అక్కున చేర్చుకొని ఆకలి, దప్పిక తీర్చుతుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, జిల్లాలు, నల్లగొండలోని డిండి, చందంపేట ప్రాం తాల నుంచి పశువులు, గొర్రెలు వస్తుండగా ఆంధ్రా ప్రాంతం నుంచి నెల్లూరు, ప్రకాశం తదితర ప్రాం తాల నుంచి బాతులు సైతం మేత కోసం ఆయకట్టు ప్రాంతానికి తీసుకొస్తారు. వేములపల్లి మండలంలో నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు చిత్రపరక వాగు, మూసీ, పాలేరుతో పాటు గొలుసు కట్టు చెరువుల్లో నీరు ఉండడంతో మూగ జీవుల దాహార్తి తీరుతుంది. జీవాలను మేపుకుంటూ తొలకరి చినుకులు పడే వరకు ఆయకట్టు భూముల్లో రాత్రివేళ వాటిని అక్కడే ఉంచి ఉదయం తీసుకెళ్తారు. రైతులు ఇచ్చే బియ్యం, డబ్బులతో జీవనం కొనసాగిస్తుంటారు.

- వేములపల్లి-ఆంధ్రజ్యోతి.





సాగర్ ఆయకట్టుకు వలస వస్తున్న పశు సంపద

వేములపల్లి ఆయకట్టు పరిధిలోకి వలస వచ్చిన గొర్రెలు





ఆంధ్రా ప్రాంతం నుంచి సాగర్ ఆయకట్టుకు వలస వచ్చిన బాతులు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని శాలిగౌరారం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కోట మల్లయ్య కోరారు. ఆదివారం శాలిగౌరారంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జమ్ము శ్రీలత, ఉపాధ్యాయులు ఎస్కే ఫజల్ పాషా, శోభ, సైదిరెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

చిట్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ చికిలంమెట్ల అశోక్ కోరారు. ఆదివారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఆధారంగానే దేశంలో పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పల్లె వెంకన్న, పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, కూరెళ్ల శ్రీనివాస్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుగా వాడుకోవాలి

గోగుల శ్రీధర్, ఏఈ, శాలిగౌరారం



ఇంటర్వ్యూ Interview

వేసవిలో కరెంట్‌ను పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని శాలిగౌరారం మండల విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ గోగుల శ్రీధర్ కోరారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి?

విద్యుత్ ఏఈ: మండలంలో శాలిగౌరారం, ఆకారం, వల్లాల, భైరవునిబండ, వంగమర్తి గ్రామాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. శాలిగౌరారంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇంకా ఎక్కడైనా నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారా?

ఏఈ: మండలంలో గురజాలలో సబ్‌స్టేషన్ మంజూరైంది. అక్కడ స్థలం లేకపోవడంతో క్యాన్సిల్ అయింది. మాదారం పక్కన చౌళ్లగూడెంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని వ్యవసాయ, కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి?

ఏఈ: మండలంలో అన్ని కేటగిరి కనెక్షన్లు 12,012 ఉన్నాయి. అందులో వ్యవసాయ కనెక్షన్లు 7914, కమర్షియల్ 930 కనెక్షన్లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో గృహజ్యోతి పథకానికి ఎంతమంది అర్హులయ్యారు?

ఏఈ: గృహజ్యోతికి సంబంధించి 6475 కనెక్షన్లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎక్కడైనా లోవోల్టేజీ సమస్య ఉందా?

ఏఈ: మండలంలో ప్రస్తుతం లోవోల్టేజీ సమస్య ఎక్కడా లేదు. ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. వస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. వేసవిలో కూడా 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఏమైనా నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారా?

ఏఈ: మండలంలో ప్రస్తుతం 7 సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వినియోగదారులకు ఏమన్నా సలహాలు సూచనలు చేస్తున్నారా?

విద్యుత్ ఏఈ: విద్యుత్ వినియోగదారులు వేసవిలో కరెంట్‌ను పొదుపుగా వాడుకోవాలి. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి.

ఆర్జాలబావిలో అరిగోస



ఆర్జాలబావిలో పనిచేయని బోరు వద్ద కాలనీవాసులు

- మంచినీటి సరఫరాలో మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం
- మంత్రి, కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు
- సమస్యను పరిష్కరించాలని డిమాండ్

రామగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఏ ఒక్కరూ కూడా తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదు.మంచినీరు రావడం లేదని ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకూడదు ఆ విధంగా అధికారులందరూ సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక కలెక్టర్ ఇలా త్రిపాఠి కూడా మంచినీటి సరఫరాపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ నీటి సమస్య ఎదురుకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ క్షేత్ర స్థాయిలో వారి ఆదేశాలు మాత్రం అమలుకావడం లేదు. జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావిలో గత 15రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చంద్రగిరివిల్లాస్ ప్రాంతంలో మూడు నెలలుగా తాగునీరు సరఫరా కావడం లేదు.

బోర్లకు మరమ్మతులు కరువు

ఆర్జాలబావిలో సుమారుగా 500 ఇళ్లకు పైగా ఉంటాయి.అయితే ఈ ప్రాంతంలో 15 రోజులుగా కృష్ణా జలాలతో పాటు నల్లానీరు రాకపోవడంతో కాలనీవాసులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.ఏఇంట్లో చూసినా ఖాళీ అయిన సంపులు ఎప్పుడు నీరుస్తుందోనని అనే ఎదురుచూపులు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీరు వచ్చినా కొద్ది సమయం మాత్రమే విడుదల చేస్తున్నారు. దీంతో నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన బోర్లు చెడిపోవడంతో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నల్లానీరు రాక నానాఅవస్థలు పడుతున్నారు. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడమో, లేక బోరకు మరమ్మతులు చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో 15రోజులుగా అవస్థలు పడుతున్నారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చంద్రగిరి విల్లాస్‌లో మూడు నెలలుగా బంద్

పట్టణంలోని చంద్రగిరి విల్లాస్‌లో సుమారుగా 150 ఇళ్లకుపైగా ఉంటాయి. ఈ ఇళ్లకు 3 నెలలుగా కృష్ణా జలాలు సరఫరా కావడం లేదు. దీంతో వాడుకునేందుకు కాలనీలోని బోరు నీరు దిక్కుగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక తాగేందుకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు పేర్కొన్నారు. సమస్యను మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించకపోతే కలెక్టరేట్ ఎదుట బిందెలతో ఆందోళన చేపడుతామని వారు హెచ్చరిస్తున్నారు.

సమస్య లేకుండా చర్యలు చేపడుతాం

ఆర్జాలబావిలో ఉన్న బోర్లు ఇంకిపోవడం వల్ల కొంత సమస్య వస్తుంది. మిషన్ భగీరథ ద్వారా రోజు విడిచి రోజు సుమారు 30 నిమిషాలకు పైగా నీరు సరఫరా చేస్తున్నాం. ఈ సరఫరా పెంపు విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్తా. ఇక చంద్రగిరి విలాస్‌కు సంబంధించి బకాయిలు కొన్నేళ్లుగా ఉండటంతో తొలగించడం జరిగింది. ఆ సమస్య కూడా త్వరలో పరిష్కారం కానుంది.

- దిలీప్ భార్గవ్, మునిసిపల్ ఏఈ

ఆర్జాలబావిలో దేవాలయ బోరే దిక్కు...

ఆర్జాలబావిలో నీటి ఇబ్బందులు తీవ్రమవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం ఏర్పాటుచేసిన దేవాలయానికి సంబంధించిన బోరు దిక్కైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి కోసం దేవాలయ కమిటీ నిర్వాహకులపై ఆధారపడాల్సి వస్తోందని దీనంగా సమాధానమిస్తున్నారు. కమిటీ వారు బోరు నీటిని కనికరిస్తేనే తమకు నీళ్లు లేదంటే అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు రెండు రోజులకు ఒకసారి వస్తున్నా అవి తాగేందుకు కూడా సరిపోవడం లేదని పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ నుంచి వచ్చే నీరు సమయం పొడిగించడంతో పాటు వార్డులో ఉన్న బోర్లకు మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

నెల రోజులుగా నీరు రావడం లేదు



కాలనీలో ఉన్న బోరు పని చేయక కొన్ని నెలలు అయింది. భగీరథ పైపులైన్ ద్వారా రెండు రోజులకు ఒకసారి వస్తున్నాయి. ఆ నీరు తాగడానికి కూడా సరిపోవడం లేదు. ఇక బట్టలు, ఇళ్లు, పాత్రలు ఎలా శుభ్రం చేసుకుంటాం. నల్లా నుంచి వచ్చే నీరు సమయాన్ని పొడిగించాలి. అంతేకాక బోర్లకు మరమ్మతులు చేసి వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలి. అప్పుడే మా సమస్య తీరుతుంది.

- కందిమల్ల వెంకటమ్మ, ఆర్జాలబావి

నీటిని వెంటనే సరఫరా చేయాలి



ఆర్జాలబావి మునిసిపాలిటీలో పడిన తర్వాత నీటి సమస్య తీవ్రంగా మారింది. బోర్లు చెడిపోయి 15 రోజులైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. 15 రోజుల్లో రెండు సార్లు మాత్రమే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. రోజువారీగా వచ్చే నీరు రాకపోవడంతో కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక నీరు పశువులకు తీవ్ర ఇబ్బంది అవుతుంది. నీటి కోసం అవస్థలు పడుతున్నాం. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

- మందడి లక్ష్మమ్మ, ఆర్జాలబావి

కమిషనర్‌కు చెప్పినా ఫలితం లేదు



చంద్రగిరి కాలనీలో మంచీనీటి సరఫరా పైప్‌లైన్‌ను మునిసిపల్ అధికారులు ఏవో కారణాలు చెపుతూ మూడు నెలల క్రితం కట్ చేశారు. అప్పటి నుంచి కాలనీలో మంచీనీటి సమస్య తీవ్రంగా మారింది. ఈ సమస్యను మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నెల రోజులైనా నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. కాలనీవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తాం.

- సాయికుమార్, చంద్రగిరి కాలనీ అధ్యక్షుడు

వైభవంగా అభయాంజనేయ స్వామి రథోత్సవం



దామెరలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నాంపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామర గ్రామంలో పద్ధతి ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు, డీజే చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ శోభన్‌బాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దామర యాదగిరి, తల్లోజు నరసింహ చారి, పూదరి సైదులు, పోలగోని శ్రీనివాస్, కడారి పెద్దలు, పెద్దిరెడ్డి యాదగిరి రెడ్డి, నక్క శ్రీనివాస్, పూదరి యాదయ్య, గ్యార కిరణ్, దామర ఇలందర్, దామెర రాజశేఖర్, సహదేవ్, బత్తుల వెంకటయ్య, బచ్చనబోయిన పెద్దులు, అధిక సంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన హజ్ కమిటీ చైర్మన్

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్‌బియబాని ఖుస్రోపాషా ఆదివారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో గల సయ్యద్ హజ్రత్ లతీఫుల్లా షాఖాద్రి దర్గాను దర్శించుకొని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. దర్గా ముతవల్లులు సయ్యద్ రషీద్, ఖాద్రి, సయ్యద్ సమిఉల్లా ఖాద్రిలు సంప్రదాయబద్ధంగా ఆయన్ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం దర్గా ముతవల్లులు, కమిటీ సభ్యులతో దర్గాకు సంబంధించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాషం, సల్మాన్, ఫెరోజ్, గౌస్ ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

యువవికాసం దరఖాస్తు తేదీని పొడిగించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నల్లగొండరూరల్, నార్కట్‌పల్లి, మర్రిగూడ, శాలిగౌరారం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తు గడువును పెంచాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున, బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి, ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, తుంగతుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ డిమాండ్ చేశారు. జిల్లాలో పలు మండలాల్లో ఆదివారం నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తు తేదీని పొడిగించాలని అన్నారు. సెలవులకు తోడు, సర్వర్ సమస్యలతో చాలా మంది యువకులు దరఖాస్తు చేసుకోలేక పోయారని, గడువును మరికొన్ని రోజులు పెంచాలని కోరారు.

నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాలడుగు నాగార్జున, మాట్లాడారు. సర్వర్ సమస్యతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు సెలవు ఉండటంతో సర్టిఫికెట్లు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేరకు ప్రభుత్వం గడువు తేదీని పొడిగించాలని కోరారు. సమావేశంలో నాయకులు బొల్లు రవీందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీపీఎంలో పలువురు యువకుల చేరిక

చిట్యాలరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు యువకులు సీపీఎంలో చేరారు. వారికి సీపీఎం నాయకులు మేడి మనోజ్, గోలి సాయి, నవదీప్‌లకు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మల్లం మహేష్, మాజీ మండల కార్యదర్శి అరూరి శ్రీనులు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పంది నరేష్, అరూరి దుర్గయ్య, సుర్కం టి మోహన్‌రెడ్డి, ఆడెపు రమేష్, దేశబోయిన నర్సింహ, మామిడి రాములు, అరూరి శంభయ్య, లింగస్వామి, లింగయ్య, బసవయ్య, సాయి కిరణ్, సైదులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం చండూరులో నిర్వహించిన చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టేది రైతులేనని, వారు పండించిన పంటలను మార్కెట్‌లో విక్రయించడానికి వస్తే సరైన ధర కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్, కమ్యూనిస్టులు మార్కెట్ కమిటీ పాలకవర్గంలో ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ కత్తు రవి, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నారబోయిన రవిముదిరాజ్, చండూరు మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సుజాతవెంకటేశ్‌యాదవ్, అనంత చంద్రశేఖర్‌గౌడ్, ఓంకారం, మాజీ సర్పంచ్‌లు కోడి గిరి బాబు, నల్లగంటి మల్లేష్, డాక్టర్ కోడి శ్రీనివాసులు, పన్నాల లింగయ్య, మంచుకొండ సంజయ్ పాల్గొన్నారు.

మర్రిగూడ: డాక్టర్ అంబేడ్కర్ దేశానికి ఒక దిక్సూచి అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని మేటిచందాపురం ఇందుర్తి గ్రామంలో ఎన్ఆర్ఐ కుంభం ప్రీతీశ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మాజీ సర్పంచ్ జంగిలి లక్ష్మి ప్రసన్నరవి ఆధ్వర్యంలో పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. మునుగోడును అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటున్నానన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, ఏర్పుల శ్రీశైలం, మాజీ ఎంపీపీలు లపంగి వజ్రమ్మ, గండికోట హరికృష్ణ, నాయకులు బాలయ్య, అజిత్‌రెడ్డి, మాతంగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్



బీపీ మండల్ విగ్రహానికి నివాళర్పిస్తున్న బీసీ నాయకులు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అని పలువురు బీసీ సంఘాల నాయకులు అన్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, మండల కమిషన్ చైర్మన్ బీపీ మండల్ 43వ వర్ధంతిని బీసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హజరైన పలువురు నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాలర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బీపీ మండల్ సేవలను కొనియాడారు. దేశంలోని రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా నియామకం కాబడి దేశవ్యాప్తంగా ఉన్న బీసీల జీవనస్థితిగతులను తెలుసుకొని వారి అభివృద్ధికై విద్య ఉపాధి రంగాలలో 27 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు మొత్తం 40 అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్ , బిజెపి రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్‌వీ.యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి,రిటైర్డు ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, కె.పర్వతాలు, అల్లి వేణుయాదవ్, బొబ్బలి గోపాలకృష్ణ యాదవ్, వంగూరు నారాయణ యాదవ్, బత్తుల శ్రీనివాస్, జెర్రిపోతుల రమేష్ గౌడ్, రమణ ముదిరాజ్, వైద్యుల సత్యనారాయణ, అంబటి వెంకన్న, గుండు వెంకటేశ్వర్లు, మామిడి పద్మ, కూరెళ్ళ విజయ్ కుమార్, మునాస ప్రసన్నకుమార్, మల్లెబోయిన సతీష్ యాదవ్, గద్దె నాగరాజు, వల్లకీర్తి శ్రీనివాస్, చల్ల కోటేష్‌యాదవ్, లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఉద్రిక్తత నడుమ కేతేపల్లి శివాలయ కమిటీ చైర్మన్ ఎన్నిక

కేతేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేతేపల్లిలోని శ్రీశంభులింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎన్నిక తీవ్ర ఉద్రిక్తత నడుమ పోలీసు బందోబస్తులో ఆదివారం జరిగింది. ఈ ఆలయ అభివృద్ధికై 62మంది శాశ్వత సభ్యత్వంతో సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఆదివారం చైర్మన్ ఎన్నికకు ఆలయంలో సమావేశమయ్యారు. అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండడంతో రహస్య బ్యాలెట్‌తో ఎన్నిక నిర్వహించాలని కొందరు, చేతులు ఎత్తే పద్ధతిన ఎన్నిక నిర్వహించాలని మరికొందరు పట్టుబట్టారు. దీంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు కలుగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఆ తర్వాత పోటీ లో ఉన్న ఇరువురు అభ్యర్థులకు రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహించారు. ఓటింగ్‌లో 54మంది సభ్యులు పాల్గొనగా 32ఓట్లు లభించిన సంకోజు జేజయ్య చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎ.వీ రాచారి, కె.కేశవరెడ్డి వ్యవ హరించారు. చైర్మన్, ఇతర పాలకవర్గ సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉండనుంది. శాలిగౌరారం ఎస్ఐ డి.సైదులు, కేతేపల్లి ఏఎస్ఐలు శ్రీనివాస్, దేవసహాయం బందోబస్తును పర్యవేక్షించారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటు అభినందనీయం



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో గ్రామస్థులు మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. తాటికల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుకూలంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేశారన్నారు. గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణం త్వరలో పూర్తి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఆరు గ్యారంటీల మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, నకిరేకల్ మున్సిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, గాదగోని కొండయ్య, సుధాకర్ పాల్గొన్నారు. కాగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్ మహాత్ముల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం పండగ



ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

కేతేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టల ఆదివారం వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తనను సిలువ వేయడానికి (గుడ్‌ఫ్రైడే)కు నాలుగు రోజులముందు ఆదివారం భక్తుల పిలుపు మేరకు ఏసుక్రీస్తు యెరూషెలెం పట్టణానికి చేరుతాడు. తమ పాప విముక్తికి ఏసుక్రీస్తు రావడం క్రైస్తవులకు జయకరమైన ఉత్సవం. దీనిని పురస్కరించుకుని క్రైస్తవులు తాటి, ఈత ఆకులతో రూపొందించిన సిలువలను చేత పట్టుకుని చర్చీల్లో ప్రార్థనలు చేస్తారు. మట్టల ఆదివారం సందర్భంగా మండలంలోని ఇనుపాముల, రాయపురం, భీమారం, కేతేపల్లి గ్రామాల్లోని చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తి గీతాలతో ఏసుక్రీస్తును స్తుతించారు. ఈ సందర్భంగా పలువురు మత గురువులు ఏసు ప్రబోధాలను బోధించారు. కార్యక్రమాల్లో ఆయా చర్చిల ఫాదర్లు ఫ్రాంచీసు, చర్చి కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్ఐ సైదులుగౌడ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): యువత త నవంతుగా వేసవి తాపాన్ని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని నల్లగొండ టూటౌన్ ఎస్ఐ ఎర్ర సైదులుగౌడ్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని పానగల్లులోని కౌండిన్య యువదళం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత తమవంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యువదళం అధ్యక్షుడు కొండ వంశీగౌడ్, సభ్యులు కొండ యశ్వంత్‌గౌడ్, జెరిపోతుల యాదయ్యగౌడ్, మురళిగౌడ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా నర్సింహ

నాంపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా దాచేపల్లి నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిశెట్టిశ్రీనివాస్, ఎన్నికల అధికారి నల్లగొండ శ్రీనివాస్ పర్యవేక్షకులు కిరణ్ సోమ చంద్రశేఖర్ల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాచేపల్లి నరసింహ మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గౌరు కేశవులు, నాయకులు గౌరు కిరణ్ కుమార్, ఎల్లా వెంకటేశ్వర్లు, సోమ శ్రవణ్‌కుమార్, బండారు లక్ష్మయ్య, వీరమల్ల నరసింహ, వీరమల్ల యాదయ్య, మురళి, గౌరు లలితయ్య, సత్తయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండలాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

కట్టంగూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని పారిశ్రామికంగా కారిడార్‌గా ప్రకటించి అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు అన్నారు. కట్టంగూరు మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరుబాట పాదయాత్ర రెండోరోజు ఆదివారం కొనసాగింది. మండలంలోని చెర్వుఅన్నారం, తొట్లవారిగూడెం, అయిటిపాముల, రామచంద్రాపురం, పెరిందేవిగూడెం, బొల్లేపల్లి, మల్లారం, మీరసాహెబ్‌గూడెం, ఇందిరమ్మకాలనీ, సత్యనారాయణపురం, మునుకుంట్ల గ్రామాల్లో సీపీఎం నాయకులు పాదయాత్ర నిర్వహించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. కార్యక్రమంలో గుండుగుంట్ల రామకృష్ణ, చిలుముల రామస్వామి, మురారి మోహన్, గడగోజు రవీంద్రాచారి, ఇటికాల సురేందర్, కట్ట బక్కయ్య, జాల రమేష్ తదితరులు ఉన్నారు.



అయిటిపాములలో పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 , కనిష్ఠం 24.0



16 నెలలుగా మంత్రివర్గ విస్తరణ జరగకుండా పదవులన్నీ ఖాళీగా ఉన్నాయి. మంత్రి పదవులు ఇచ్చే సమయంలో మాజీ మంత్రి జానారెడ్డి అధిష్ఠానానికి ఉత్తరం రాయడంతో విస్తరణ జాప్యమవుతోంది.

● కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



రాజకీయ దుమారం

- జానారెడ్డి టార్గెట్‌గా రాజగోపాల్‌రెడ్డి కామెంట్లు
- జానా లేఖతోనే మంత్రిపదవి చేజారిందనే భావనలో ఎమ్మెల్యే
- అధిష్ఠానం హామీ ఇచ్చినా నేతలు అడ్డుపడుతున్నారని ఆరోపణ
- మూడోమంత్రి పదవిపై జిల్లాలో రగులుతున్న రాజకీయం

మాజీ మంత్రి, సీనియర్‌నేత జానారెడ్డిని నేరుగా టార్గెట్ చేస్తూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించాయి. తనకు మంత్రిపదవి రాక పోవడానికి జానారెడ్డి రాసిన లేఖ కారణమని భావిస్తోన్న రాజగోపాల్, మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో ఒక్కసారిగా రాజకీయ దుమారం చెలరేగింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక దాదాపు 16నెలల తర్వాత మొదటిసారిగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో పార్టీలో అసంతృప్తి బహిర్గతమైంది. ఈ పరిస్థితి టీకప్పులో తుపానులా సద్దుమణుగుతుందా..? లేక అసమ్మతి ప్రజ్వరిల్లి వర్గపోరుకు దారి తీస్తుందా..? అని రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చసాగుతోంది. తనకు మంత్రిగా అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిన మాట వాస్తవమని, మంత్రి పదవి ఖరారయ్యే సమయంలో జానారెడ్డి లేఖతో మళ్లీ మొదటికొచ్చిందని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తాను ఇన్నిరోజులూ ఆగానని, ఇక తాను కూడా మంత్రిపదవి కోసం అడుగుతానని, వెనకబడిన ప్రాంత అభివృద్ధికోసం మంత్రిపదవి కావాలని డిమాండ్ చేశారు.


ఖమ్మంలో ముగ్గురికి ఇచ్చినప్పుడు..

ఖమ్మంలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు గెలిస్తే, ముగ్గురికి మంత్రి పదవులిచ్చినప్పుడు, నల్లగొండలో 11 మందిని గెలిపిస్తే ఎందుకివ్వరని రాజగోపాల్‌రెడ్డి నిలదీయడం రాజకీయవర్గాల్లో తీవ్రచర్చకు దారి తీసింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంలో రాష్ట్రంలో ఒక్కో సీటుకు ఒక్కో సీటు కు ఒక్కో మంత్రి ఇన్‌చార్జిగా ఉన్నారని, ఎక్కడాలేని విధంగా భువనగిరిలోనే ఒక ఎమ్మెల్యేనైన తాను ఇన్‌చార్జిగా బాధ్యతలిచ్చారంటే, తన సమర్థతపైనా, అభ్యర్థిని గెలిపిస్తానేనే నమ్మకం ఉండబట్టే ఇచ్చారని, ఆ ఎన్నికలో అన్ని నియోజకవర్గాలు తిరిగి అభ్యర్థిని గెలిపించడమే తన సమర్థతకు, పనితీరుకు నిదర్శనమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొంటున్నారు. మంత్రులు ఇన్‌చార్జిలుగా ఉన్న మహబూబ్‌నగర్, సికింద్రాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల స్థానాల్లో ఎందుకు ఓడిపోయారు, ఈ మంత్రులంతా ఎటు పోయారని ప్రశ్నించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో చర్చను రాజేసినట్లయింది. ఒకే కుటుంబానికి రెండు మంత్రి పదవులు ఎలా ఇస్తారనే అంశాన్ని ప్రస్తావిస్తూ రాజగోపాల్‌రెడ్డి ఇస్తే తప్పేంటని, సమర్థతను పరిశీలించాలే తప్ప ఇలాంటి సమీకరణాలు కాదని, తనకు మంత్రి పదవి వస్తే పార్టీకి, ప్రజలకు మేలు చేస్తానని పేర్కొన్నారు.

అసమ్మతికి బీజం పడ్డట్లేనా...!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 16 నెలల తర్వాత మొదటిసారిగా రాజగోపాల్‌రెడ్డి రూపంలో అసమ్మతి స్వరం వెలువడింది. తనకు అధిష్ఠానం ఇస్తానన్న మంత్రిపదవికి దుర్మార్గంగా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారంటూ రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలు ఢిల్లీలో జరిగిన తెరవెనక మంత్రాంగాన్ని తెలియజేస్తోంది. తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని, అధిష్ఠానం సుముఖంగా ఉన్నా జిల్లా నేతలే అడ్డుపడుతున్నారని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించడం పార్టీలో అంతర్గత విబేధాలున్నాయనే అంశాన్ని స్పష్టం చేస్తోంది. నేరుగా జానారెడ్డిని టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ అధిష్టానానికి తన సందేశాన్ని నేరుగా ఇచ్చినట్లవుతుందనే వ్యూహంలో భాగంగానే రాజగోపాల్‌రెడ్డి జానాపై వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. కొందరు నాయకులు తనకు మంత్రిపదవి రాకుండా దుర్మార్గంగా అడ్డుకుంటున్నారని పేర్కొన్న రాజగోపాల్‌రెడ్డి ఎవరి పేర్లు ప్రస్తావించలేదు...

- మిగతా 5వ పేజీలో...



పాల బిల్లుల కోసం.. నిరీక్షణ

- నెలలతరబడి వేచి చూస్తున్న పాడి రైతులు
- సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పశుపోషణకు ఇబ్బందులు
- మదర్ డెయిరీ అప్పులతో రైతులకు కష్టతరంగా మారిన వైనం
- ప్రభుత్వ గ్రాంటా? స్థిరాస్తుల విక్రయమా..?

మదర్‌డెయిరీలో నెలకొన్న అప్పులతో పాడి రైతులకు బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది. నెలల తరబడి పాల బిల్లులకోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రైతులకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పశు పోషణకు ఇబ్బందులు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఏర్పాటైన నల్లగొండ-రంగారెడ్డిజిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం(మదర్‌డెయిరీ) అప్పుల ఊబిలో చిక్కుకుంది. మదర్‌డెయిరీకి ప్రస్తుతం రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పులున్నాయి. నెలకు రూ.45లక్షల మేరకు వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రైతులకు సకాలంలో సంస్థ బిల్లులు చెల్లించలేక పోతుంది. మదర్ డెయిరీ భవిష్యత్‌తోపాటు సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని రైతుల్లో చర్చ మొదలైంది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో నార్మూల్ పరిధిలో మొత్తం 290 పాల సంఘాలున్నాయి. పాలసంఘాల ద్వారా నిత్యం దాదాపు 60వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. పాడి రైతులకు నెలావారీగా బిల్లులు చెల్లించాలని పాల సంఘాల చైర్మన్లు పాలకవర్గానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం పాలకవర్గం ఆధ్వర్యంలో మదర్‌డెయిరీని లాభాల బాట పట్టించి, రైతులకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తుందన్న అంశం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మదర్‌డెయిరీకి ప్రత్యేకంగా గ్రాంట్‌ను మంజూరు చేయించేందుకు పాలకవర్గం కసరత్తు చేస్తుంది. మరోవైపు సంస్థ పరిధిలోని భూములను వేలం వేసి రైతులకు చెల్లించాల్సిన బిల్లులతోపాటు...పలు బ్యాంకుల్లో ఉన్న అప్పులు తీర్చాలని కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. ఆస్తుల విక్రయం ఆలస్యమవుతున్నందున, ప్రభుత్వం నుంచి తక్షణం సహాయం కోసం జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యలు విన్నవించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో..

- మిగతా 5వ పేజీలో...

సన్న బియ్యం ధరలు దిగొచ్చే

- మార్కెట్‌లో క్వింటాకు రూ.400 మేర తగ్గిన సన్నబియ్యం ధరలు
- మధ్య తరగతి వర్గాల్లో ఆనందం
- రేషన్‌దుకాణాలకు క్యూ కడుతున్న ప్రజలు



సన్నబియ్యం ధర తగ్గుతోంది. ఇన్నాళ్లు కేవలం ధనిక కుటుంబాలకే పరిమితమైన సన్నబియ్యం భోజనం కాంగ్రెస్ ప్రభుత్వ పథకంతో ఇప్పుడు పేద వారికి కూడా అందుతోంది. దీంతో మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.600 వరకు తగ్గింది. సన్నబియ్యం ధరలు తగ్గుతుండడంతో ఇటు పేద, మధ్య తరగతి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి కలెక్టరేట్)

4

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

- ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో గుండాలలో వృద్ధురాలు
- లారీ ఢీకొని చౌటుప్పల్ మండలంలో మరొకరు..
- ఉమ్మడి జిల్లాలో మరో నలుగురి దుర్మరణం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. గుండాల మండలంలో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం.. వృద్ధురాలి మృతికి కారణమైంది. చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద లారీ ఢీకొని ఒకరు మృతి చెందారు. దేవరకొండ, వేములపల్లి, కేతేపల్లి మండలాల్లో జరిగిన ప్రమాదాల్లో మరో ముగ్గురు దుర్మరణం చెందారు.

4

నవ వధువు బలవన్మరణం

- పెళ్లయిన 25 రోజులకే విషాదం
- చౌటుప్పల్ పట్టణంలో ఘటన

బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది

- 25 ఏళ్ల పండుగకు వెల్లువలా జనం తరలి రావాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఇతర నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోనుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ 25ఏళ్ల పండుగకు జనం వెల్లువలా తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. శ్రీశైలం సొరంగమార్గాన్ని శాశ్వతంగా మూసివేసేందుకు ప్రభు త్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదన్నారు. సొరంగంలో ప్రమా దం జరిగితే సహాయక చర్యలు చేపట్టి వారిని వెలికితీసే తెలివి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. రైతులకు బాధ కలగగానే కేసీఆర్ ఉంటే బాగుండునని కేసీఆర్ తలుచుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులకు, వారు పెట్టే కేసులకు భయపడబోమన్నారు. వారు చేసిన పనులకు వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. మంత్రులంతా దందాల్లో మునిగి తేలుతున్నారన్నారు. పార్టీ పెట్టినప్పు డు చంద్రబాబు నాయుడు టీఆర్ఎస్ ఉండదని, మధ్యలోనే బంద్ అవుతుందని శాపనార్థాలు పెట్టారని గుర్తుచేశారు. మొదటి వార్షికోత్సవ సభను నల్లగొండలో పెట్టి విజయవంతం చేశామని ఎన్నో మైళ్ల రాళ్లను అధిగమించి అనేక మంది రాక్షసులను తరిమికొట్టామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోతలకు పరిమితమ య్యారని, ఆయనకు చేత కాదని, మిల్లర్లు రైతులపై దాడికి దిగుతున్నారన్నారు. రెండు రోజుల క్రితం సూర్యాపేటలో ఓ రైతు మద్దతు ధర రాక ధాన్యానికి నిప్పు పెట్టుకున్నాడన్నారు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లకు కల్తీ నిత్యావసర సరుకులు సరఫరా చేస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ 25ఏళ్ల పండుగకు వరంగల్‌కు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను, ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చకిలం అనిల్ కుమార్, జి.వెంకటేశ్వర్లు, మాలే శరణ్యారెడ్డి, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, కరీంపాషా, తండు సైదులు, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్ రెడ్డి, యాట జయప్రద, రవీందర్‌రావు, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న రాజశేఖర్‌రెడ్డి, సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదును పెంచి, పాఠశాలలను కాపాడుకుందాం అని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆయన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు క్రమక్రమంగా తగ్గుతుందని, ప్రతీ యూటీఎఫ్ కార్యకర్త కర్తవ్యంగా తీసుకొని, బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేరే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించాలని, ప్రభుత్వ విద్యవల్ల మాత్రమే అంతరాలు లేని సమాజం ఏర్పడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ అధ్యయనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా, హక్కులు-బాధ్యతలు రెండు నేత్రాలుగా ముందుకు పోతూ ప్రభుత్వ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎడ్ల సైదులు, గేర నరసింహ, నల్లపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమ్రరాజు సైదులు, పాలబిందెల రాజశేఖర్, రవీందర్, సైదులు, రాంబాబు, కృష్ణప్రసాద్, రమణ, నవీన్ రెడ్డి, భూరానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతిపై నేడు రైతు వేదికల ద్వారా

సీఎం సందేశం

నల్లగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారంనుంచి భూభారతిని రాష్ట్రంలోని మూడు మండలాల్లో ప్రయోగాత్మకం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతు వేదికల ద్వారా సీఎం రేవంత్ రెడ్డి తన సందేశాన్ని రైతులకు తెలియజేస్తారని జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి మంత్రులు, శాస్త్రవేత్తలు రైతులకు భూభారతితో పాటు రైతునేస్తం వంటి అంశాల గురించి వివరిస్తారన్నారు. సాయంత్రం 5గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి భూభారతిని ప్రారంభించి రైతు వేదికలో ఉండే రైతులనుద్దేశించి మాట్లాడుతారని చెప్పారు. రైతువేదికలకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యమకారుల ఫోరం ప్లీనరీని

విజయవంతం చేయాలి

ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు ఈ నెల 21న నిర్వహించే తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీని విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకోగా ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ముస్తాఫా, కార్యదర్శి దాసరి వెంకన్న ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద, శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో కూడిన ఇల్లు, రూ.25 వేలపింఛన్ ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాల్లో ఆయా గ్రామాల్లో ఉన్న ఉద్యమకారులను గుర్తించి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యమకారులు నలపరాజు శ్రీనివాస్, బొడ్డుపల్లి రామకృష్ణ, కట్టా శ్రీనివాస్, రమేష్‌చారి, భార్గవ్, వంటిపాక యాదగిరి, ముజీబ్, యాదయ్య, మనిమద్దె రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల వాన బీభత్సం

- నేలకొరిగిన చెట్లు.. తోటలు ధ్వంసం
- కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యం



శాలిగౌరారం మండలం ఆకారం ఐకేపీ కేంద్రంలో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

నకిరేకల్,ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాలవర్షంతో రైతుల ధాన్యం తడిసి ముద్దయింది. మండలంలోని ఓగోడు, వల్లభాపురం, నడిగూడెం ఐకేపీ కేంద్రాల్లో రైతులు విక్రయానికి తెచ్చిన సుమారు 15వేల బస్తాల ధాన్యం అకాల వర్షంతో తడిసింది. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం లో భారీ ఈదురు గాలులతో వడగళ్ల వాన కురిసింది. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. పలు తోటలు ధ్వంసమయ్యాయి. ఈ వర్షంతో జనజీవనానికి తీవ్ర ఆటంకం కలిగింది. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు వర్షానికి కొట్టుకుపోయాయి. రైతు గౌర శేఖర్ ధాన్యం రాశులు వర్షం నీటిలో కొట్టుకుపోయాయి. ఆకారం, భైరవుని బండ, గురజాల, చిత్తలూరు ఐకేపీ కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు కూలి పోయాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి కానుందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు ఈ సభ ద్వారా దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను కన్న బిడ్డలుగా చూసుకొని వారి అభివృద్ధికి పాటుపడిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, అమలు కాని 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల ముందు ఎండగట్టి పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ సంసిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, అది గ్రహించే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికలను వాయిదా వేసుకుంటూ పోతుందని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని సూచించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ తేరా గోవర్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యొల్గురి వల్లపురెడ్డి, నాయకులు అర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, సుధాకర్‌గౌడ్, రవికుమార్, రాయనబోయిన శ్రీను, గోలి గిరి, బొడ్డుపల్లి మహేందర్, రమావత్ దామోదర్, వెంకటయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకన్న, హనుమానాయక్, ప్రదీప్, బాలు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపట్టాలి

● బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్


బీపీమండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులరిస్తున్న నాయకులు

దేవరకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దివంగత బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీపీ మండల్ ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడని, ఆర్థిక, సామాజిక, రాజకీయంపై సర్వే చేసి మండల్ కమిషన్‌ను బీసీల యొక్క 40 అంశాలను సిఫారసు చేసినట్లు గుర్తు చేశారు. జాతీయస్థాయిలో కులాల వారీగా కులగణన చేసి జనాభా లెక్కలను బయటపెట్టాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రజకసంఘం రాష్ట్ర నాయకుడు ఆమంచి అంజయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకులు భాషానాయక్, కొండ్రపల్లి శ్రీను, వరికుప్పల శ్రీను, గడ్డం వెంకటయ్య, కేశవచారి, శారద, లక్ష్మణ్, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బంకు నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

చింతపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్), కుర్మేడ్, హైవేలోని ఆదివారం పలు పెట్రోల్ బంకులలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌ను ట్రాక్టర్‌లో వచ్చిన వారికి డ్రమ్ముల్లో పోసి విక్రయించడంతో వారు అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. లూజుగా పెట్రోల్ అమ్మినా ఇంధనంలో నాణ్యత లేకున్నా విక్రయించిన నిర్వాహకులే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు.

రైసుమిల్లుల కాలుష్యం నుంచి కాపాడాలి


రైసుమిల్లుల వద్ద నిరసన తెలుపుతున్న హనుమాన్‌పేట, గణేష్‌నగర్ వాసులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల కాలుష్యం నుంచి తమను కాపాడాలని హనుమాన్‌పేట, గణేష్‌నగర్ వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మిల్లుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హనుమాన్‌పేటకు చెందిన ఆంజనేయులు మాట్లాడుతూ హనుమాన్‌పేట సాగర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైసుమిల్లులు, పార్‌బాయిల్డ్ మిల్లుల నుంచి వెలువడే పొట్టు, బూడిద ఇళ్లల్లో పడుతుందని అన్నారు. రైస్‌మిల్లు పొగ గొట్టాలను తక్కువ ఎత్తులో ఉంచడం వల్ల పొట్టు, తవుడు, దుమ్ము, బూడిద సమీపంలోని ఇళ్లపై, వంట సామగ్రిపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు ఇంటి బయట ఆడుకోలేని పరిస్థితి నెలకొందని, ఇంటిపై కప్పులపై బూడిద పేరుకుపోతుందని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు నరేష్, యాదయ్య, కోటమ్మ, రామకృష్ణ, లలిత, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందువులంతా ఐకమత్యంగా ఉండాలి


సహపంక్తి భోజనం చేస్తున్న స్వామిజీలు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా ఐకమత్యంగా ఉండాలని సాధు పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామిజీ, రాష్ట్రీయ శివాజీసేన అధ్యక్షుడు తాడోజు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఈదులగూడలో దళితవాడలో ఆదివారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్టును, పుట్టను, గుట్టను, జీవాలన్నింటినీ ప్రేమించాలని హిందూ ధర్మం సూచించిందన్నారు. ధర్మ వ్యతిరేకంగా చేసే బోధనలు నమ్మవద్దని, హిందువులంతా ఒకే కుటుంబ సభ్యులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సాధు పరివార్ సభ్యులు శివరుద్రస్వామిజీ, సత్యనారాయణ స్వామిజీ, వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి సత్యనారాయణ, హిందూ ఉత్సవ సమితి సభ్యులు క్రాంతికుమార్, వంశీ, శ్రీకాంగ్ మణి, ప్రశాంత్, నాగరాజు పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం



- రికార్డుల్లో 81 ఎకరాలు
- క్షేత్రస్థాయిలో ఉన్నది 40 ఎకరాలే...
- సగం భూములు మాయం
- సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కొప్పోలు గ్రామస్థుల డిమాండ్

గుర్రంపోడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో ప్రాశస్త్యం గల దేవాలయాల భూములు మాయమవుతున్నాయి. 1950లో గ్రామానికి చెందిన పెద్ద రైతులు ఇక్కడి నాలుగు దేవాలయాలకు వంద ఎకరాలు దానంగా ఇచ్చారు. రికార్డుల్లో 81 ఎకరాలుగా నమోదయ్యాయి. ఆ భూములు పక్కన రైతులు ఆక్రమించుకోవడంతో ప్రస్తుతం 40ఎకరాలే మిగిలాయి. ఆలయ భూముల ఆక్రమణపై గ్రామదేవాలయ కమిటీ పలుమార్లు తహసీల్దార్ దేవాదాయశాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.వాస్తవంగా అన్ని దేవాలయ భూములకు ఏటా రూ.8లక్షల కౌలు రావాల్సి ఉండగా భూముల అన్యాక్రాంతంతో రూ.3లక్షలకు మించి రావడం లేదు. దీంతో ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

25 ఎకరాలకే కౌలు వేలం

కొప్పోలు గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయానికి 25ఎకరాలకుగాను 12ఎకరాలు, సదాశివాలయానికి 15ఎకరాలకుగాను 13ఎకరాలు, ఆంజనేయస్వామి దేవాలయానికి 20ఎకరాలకు 15ఎకరాలు, ఆయోధ్య రామస్వామి దేవాలయానికి 21 ఎకరాల భూమికి గాను గుంట భూమి కూడా లేదు. ఇందులో అంజనేయస్వామి దేవాలయానికి ఉన్న 15 ఎకరాలను ఆలయ పూజారి కుటుంబ పోషణ, దూపదేపనైవేద్యాల ఖర్చుల నిమిత్తం పూజారి ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. మిగతా 25 ఎకరాలకు మాత్రమే కౌలు వేలంపాట నిర్వహిస్తున్నారు.

సర్వేతోనే సరి... హద్దు రాళ్లు ఏవీ?

సీతారామచంద్రస్వామి దేవాలయ భూముల ఆక్రమణలపై ప్రజావాణిలో గ్రామస్థులు ఫిర్యాదు చేయగా నాలుగు నెలల క్రితం సర్వే చేశారు. మూడు ఎకరాల భూమిని పక్క రైతుల భూముల నుంచి బయటికి తీశారు. కానీ వీటికి హద్దురాళ్లు పాతకపోవడంతో ఆక్రమణల చెర వీడలేదు.

చరిత్ర ఘనం... నిధుల్లేక నీరసం

గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో భద్రాదిలో రామాలయంలో మాదిరిగా ఏకశిలపై దేవతామూర్తుల విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడ పూర్వకాలం నుంచి శ్రీరామనవమి సందర్భంగా ఎడ్ల పందాలు, జిల్లా స్థాయి క్రీడాపోటీలు, రథోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. శివాలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. పక్కనే గల కోనేరులో నీటి బుగ్గ నుంచి ధారాళంగా నీరు వస్తూ వేసవిలోనూ ఎండిపోకుండా ఉండటంతో బుగ్గరామలింగేశ్వరస్వామిగా పేరు వచ్చింది. ఇంత పాశస్త్యం గల దేవాలయాల అభివృద్ధికి నిధులు లేక ఆలయ కమిటీలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక కొప్పోలు - అమలూరు మధ్య గల పురాతన అయోధ్య రామస్వామి ఆలయం ఏనాడు పూజలకు నోచుకోలేదు. భూములు ఉంటే ఆదాయంతో పూజలు నిర్వహించే అవకాశం ఉంటుంది.

దేవాలయ భూములకు హద్దురాళ్లు పాతాలి



దేవాలయ భూములకు హద్దు రాళ్లు పాతాలని పలుమార్లు రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులను కోరాము. దేవాలయ భూములు పరిరక్షిస్తే ఆలయాలను అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలను కల్పించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు సర్వే చేసి ఆలయ భూములను ఆక్రమణ చెర నుంచి విడిపించాలి.

\- తేలుకుంట్ల రవికుమార్, కొప్పోలు

త్వరలోనే సర్వే నిర్వహిస్తాం

కబ్జాకు గురైనట్లు చెబుతున్న దేవాలయ భూముల రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. మార్చి 21వ తేదీన సర్వే నిర్వహించలని భావించాం. అసెంబ్లీ సమావేశాల కారణంగా నిలిపివేశాం. త్వరలోనే సర్వే నిర్వహించి దేవాలయ భూములకు హద్దురాళ్లు ఏర్పాటు చేసి ఆలయ కమిటీకి అప్పగిస్తాం.

\- ఫరీద్, ఇన్‌చార్జి తహసీల్దార్, గుర్రంపోడు

సర్వే నిర్వహించాలని కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతులు

ఆలయ భూములకు సర్వే నిర్వహించాలని ఆలయ కమిటీ చైర్మన్ అయితగోని పరమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. మొదట మార్చి 21న సర్వే నిర్వహిస్తామని అధికారులు చెప్పినా సర్వే నిర్వహించకపోవడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా సర్వే నిర్వహించలేకపోతున్నామని, త్వరలోనే నిర్వహిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఫరీద్ వివరించారు. అయినా నేటికీ సర్వే నిర్వహించక పోతుండటంతో రాజకీయ ఒత్తిడితోనే సర్వే నిర్వహించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం ర్యాలీ


మిర్యాలగూడ పట్టణంలో ఈత మట్టలతో ర్యాలీలో పాల్గొన్న క్రిస్టియన్లు

వేములపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళి పాపపరిహారార్థం కోసం ఏసుక్రీస్తు ప్రభువు సిలువలో తన రక్తాన్ని చిందించి తిరిగి మూడవ రోజు పునరుద్ధానమైనట్లు పాస్టర్ రెవ, కొమ్ము హోసన్న అన్నారు. మండల కేంద్రంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం చిన్న పిల్లలతో కలిసి సంఘం పెద్దలతో ఈత మట్టలు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ హోసన్న మాట్లాడుతూ నాడు ఏసుక్రీస్తు సిలువ వేయడానికి ముందుగా ఎరుషలేం పట్టణంలో ఆ ప్రాంత ప్రజలు గాడిదపై ఏసుక్రీస్తు ఊరేగింపుగా బయలుదేరి వెళ్తుండగా ఖర్జూరపు మట్టలతో జయజయ ధ్వానాలు చేస్తూ ఊరేగింపుగా అందరూ కలిసి ఉత్సవాలు నిర్వహించుకున్నారని తెలిపారు. దానికి నిదర్శనంగా ప్రతి ఏటా ఈత మట్టలతో క్రైస్తవ సోదరులు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చెట్టిపల్లి శామ్యుల్‌జాన్సన్, కార్యదర్శి దైద సాల్మన్‌రాజ్, కోశాధికారి పుట్టల నతానియేల్, పుట్టల జోసెఫ్‌డానియేల్, పుట్టల ఇమ్మానియేల్, పుట్టల విజయ ప్రేమ్‌కుమార్, బొంగర్ల సమాధానంరాజ్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ క్రైస్తవుల పూజలు

మిర్యాలగూడటౌన్: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ క్రైస్తవులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని విశ్వాస పరిచర్య చర్చి ప్రాంగణంలో ఫౌండర్ ధీరావత్ హన్యానాయక్ ఆధ్వర్యంలో ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా యుద్ధ వాతావరణం ఏర్పడుతున్న తరుణంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ మట్టల ఆదివారం సందర్భంగా ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమాభాయి, జనార్ధన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


వేములపల్లి : మట్టల ఆదివారం ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మండల్ కమిషన్ సిఫార్సులను అమలుచేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగం గౌడ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీసీ వర్గాల పేదరిక నిర్మూలనకు బీపీ మండల్ చేసిన సిఫార్సులను ప్రభుత్వం అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి మాలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల వెనుకబాటుతనాన్ని నిర్మూలించేందుకు మండల్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. వెనుబడిన తరగతుల అధ్యయానికి వేసిన కమిషన్‌కు బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ అధ్యక్షత వహించినట్లు ఆయన తెలిపారు. 1980లో మండల్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని, అనంతరం కమిషన్ సిఫార్సుల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలు చేసినట్లు తెలిపారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కులు, ఓబీసీల కోసం మండల్ తీవ్రంగా కృషి చేశారని అన్నారు. బీసీల పేదరిక నిర్మూలనకు కమిషన్ సిఫార్సులన్నింటినీ అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, జ్వాల, ఊరుబండి శ్రీనివాస్, ఎస్పీ నాయుడు, దోనేటి శేఖర్, నాగరాజు, వంశీ, సైదులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

● మిర్యాలగూడ టౌన్: బీపీ మండల్ సిఫార్సులను అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. పట్టణంలోని అమరవీరుల పార్కులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుణగంటి వెంకన్న, కర్నాటి శివ రామకృష్ణ, వడ్డెబోయిన సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత కలయిక...

● ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఒకే పాఠశాల లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో కలిసి ఒకే వేదికపై ఆనందంగా గడిపారు. ఆదివారం మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకొని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత ఒకే పాఠశాలలో చదువుకున్న, విద్యాబోధన చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు కలవడం అభినందనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం సుఖజీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామానుజాచార్యులు, జ్వాలా నరసింహారావు, అనిల్‌కుమార్, రాయపాటి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అంజమ్మ, సురేష్, పూర్వ విద్యార్థులు భాస్కర్, రవి, నాగార్జున, రామలింగయ్య, రమేష్, అంజి, పకీరా, శ్రీ నునాయక్, కొండలు, నాగరాజు, అనూష పాల్గొన్నారు.


తిరుమలగిరి(సాగర్)లో సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 2008-09 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం మండలకేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాము గడిపిన గత స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పల్లా వెంకట్‌రెడ్డి, మురళి, బాల్‌రెడ్డి, వెంకట్ నారాయణ, జయరాములు, చంద్రయ్య, చంద్రమౌళి, పూర్వవిద్యార్థులు శంకర్, అక్బర్, బాలకృష్ణ, దేవ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


మదనాపురంలో ఆలయంలో కల్యాణం చేస్తున్న అర్చకులు

చింతపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలం మదనాపురంలోని లక్ష్మీనరసింహ ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు కల్యాణ తంతు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, హైదరాబాద్‌కు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయశాఖ కార్యనిర్వహణాధికారి జె.జయరామయ్య, ఆలయ ప్రధాన అర్చకులు మురుకుంట్ల సీతయ్యశర్మ, రవిశర్మ, శ్రీనివాస్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ దేరంగుల మహేష్, మాజీ జడ్పీటీసీ జంగిటి నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు జంగిటి శ్రీనివాస్, ధర్మకర్తలు ఆడేపు కల్పన మహేందర్, వెంకటయ్య, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి


పోటీలను ప్రారంభిస్తున్న వద్య రమేష్‌నాయక్

డిండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని, వారికి తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వద్య రమేష్‌నాయక్ అన్నారు. డిండి మండలం చెర్కుపల్లి స్టేజీ వద్ద ఆదివారం శ్రీబంజార భగత్‌సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. గ్రామాలు, తండాలలోని యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్దతండా మాజీ సర్పంచ్ వెంకట్, సరియా నాయక్, ఫూల్‌సింగ్ నాయక్, బాలాజీనాయక్, చైతన్య, బంజారా, భగత్‌సింగ్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ పాలనపై పోరాడాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంసీపీఐ(యు) నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలకు, పాలకుల నియంతృత్వానికి వ్యతరేకంగా ప్రజలు ఉద్యమించాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. జలియన్‌వాలాబాగ్ ఘటనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ, ఎంసీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం సాగర్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయ్యర్ అకృత్యానికి బలైన అమరవీరులకు నివాళులర్పించారు. నియంత పోకడలను ఎదిరించేందుకు ప్రతినబూనాలని అన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) జిల్లా నాయకులు మచ్చ సైదులు, భరత్, కిరణ్, ముత్తయ్య, జ్యోతి, రవి, ఇమ్మానియేల్, మౌనిక, చరణ్, లక్కి పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం కోసం కరాటే దోహదం

హాలియా, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యం కోసం కరాటే ఉపయోగపడుతుందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియా మునిసిపాలిటీకి చెందిన కందుల రమేష్ ఏర్పాటు చేసిన విక్టరీ చోటోఖాన్ కరాటే అకాడమీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భగత్‌కు స్వాగతం పలికి అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉర్లగొండ వెంకటేశ్వర్లు, మార్కెట్ మాజీ డైరెక్టర్ సురభి రాంబాబు, పాక్స్ మాజీ డైరెక్టర్ బొమ్మిశెట్టి ఆంజనేయులు, నాయకులు పగడోజు సైదాచారి, పల్లి జానకిరాములు, సీతరాల మహేష్, పిల్లి నాగరాజు, బాష, మేకల శంకర్, బొమ్ము శివ తదితరులు పాల్గొన్నారు.